సాక్షి
నాగర్‌కర్నూల్

శనివారం । 21 । జనవరి । 2023



స్తంభించిన విక్రయాలు

బాదేపల్లి మార్కెట్ యార్డులో శుక్రవారం ధాన్యం విక్రయాలు స్తంభించిపోయాయి.

వివరాలు 8లో ▸



మతసామరస్యానికి ప్రతీక..

అబ్దుల్ ఖాదర్‌షా రహెమతుల్లా దర్గా మత సామరస్యానికి ప్రతీకగా నిలుస్తోంది.

వివరాలు 10లో ▸

గరిష్టం/కనిష్టం
30.5 /16.9

వాతావరణం

ఉదయం ఆకాశం మేఘావృతమై చల్లని గాలులు వీస్తాయి. ఉదయం, రాత్రివేళ చలి తీవ్రత ఎక్కువగా ఉంటుంది.

న్యూస్‌రీల్

వాలీబాల్ జిల్లా జట్టు ఎంపిక



కందనూలు: జిల్లాకేంద్రంలోని జెడ్పీ క్రీడా మైదానంలో వాలీబాల్ సీనియర్ పురుషుల జట్టు ఎంపికలు శుక్రవారం నిర్వహించారు. కొల్లాపూర్, అచ్చంపేట, కల్వకుర్తి, నాగర్‌కర్నూల్ నియోజకవర్గాల నుంచి దాదాపు 100 మంది క్రీడాకారులు పాల్గొన్నట్లు వాలీబాల్ అసోసియేషన్ ఇన్‌చార్జ్, ఎస్‌జీఎఫ్ కార్యదర్శి ప్రసాద్‌గౌడ్ తెలిపారు. అనంతరం వాలీబాల్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు నిరంజన్ పాల్గొని.. ఎంపికైన క్రీడాకారులను పరిచయం చేసుకొని మాట్లాడారు. క్రీడలతో మంచి అలవాట్లు, శరీర దారుఢ్యం, మంచి ఆరోగ్యం వస్తుందన్నారు. ఎంపికలో ప్రతిభకనబరిచి, జిల్లాకు మంచి పేరు తీసుకురావాలని క్రీడాకారులకు సూచించారు. ఎంపికైన క్రీడాకారులు రాష్ట్రస్థాయి పోటీల్లో పాల్గొంటారని చెప్పారు. కార్యక్రమంలో వాలీబాల్ అసోసియేషన్ జిల్లా ఉపాధ్యక్షులు సత్యనారాయణ, నరేందర్‌నాయక్, సంయుక్త కార్యదర్శి బాలసుబ్రమణ్యం, వెంకటేష్ తదితరులు పాల్గొన్నారు.

శనేశ్వరుడికి ప్రత్యేక పూజలు



బిజినేపల్లి: మండలంలోని వడ్డెమాన్‌లో వెలసిన జేష్ఠాదేవి సమేత శనేశ్వరస్వామికి భక్తులు ప్రత్యేక పూజలు చేశారు. సూర్యదేవుడు మకరరాశి నుంచి కుంభరాశిలోకి ప్రవేశించడంతో పుష్య మాసం ప్రారంభం అవుతుందని, ఈ మాసం శనేశ్వరుడికి ప్రీతికరమైనదని ఆలయ ప్రధాన అర్చకులు గవ్వమఠం విశ్వనాథశాస్త్రి తెలిపారు. ఈ సందర్భంగా స్వామివారికి ప్రత్యేక అలంకారంతో పూజలు చేశారు. శనివారం పుష్యమాసం సందర్భంగా మరింత వైభవ పూజలు నిర్వహిస్తామని, శని గ్రహదోషం ఉన్నవారు తప్పకుండా పూజలు చేయాలని సూచించారు.

కాంట్రాక్టు వైద్యుడి తొలగింపు

అచ్చంపేట రూరల్: విధుల పట్ల అలసత్వం వహిస్తూ వ్యక్తి మరణానికి కారణమైన కాంట్రాక్టు వైద్యుడు బాల్‌సింగ్‌ను కలెక్టర్, కమిషనర్ ఆదేశాల మేరకు విధుల నుంచి తొలగిస్తున్నట్లు డీసీహెచ్‌ఎస్ డాక్టర్ రమేష్‌చంద్ర తెలిపారు. అలాగే నిర్లక్ష్యం వహించిన సిబ్బందిపై వేటు వేస్తామని చెప్పారు. కాగా స్థానికులుగా ఉన్న వైద్యులే తరుచూగా అచ్చంపేట ప్రభుత్వ ఆస్పత్రిలో పనిచేస్తున్నారని, వారే స్థానికంగా ప్రైవేటు ఆస్పత్రులు నిర్వహిస్తూ ప్రభుత్వ ఆస్పత్రి రోగులపై నిర్లక్ష్యం చేస్తున్నారన్న ఆరోపణలు ఉన్నాయి. ప్రభుత్వ ఆస్పత్రికి వచ్చే రోగులను తమ ఆస్పత్రులకు రెఫర్ చేయించుకుని వచ్చీరాని వైద్యంతో కాసులు దండుకుంటున్నారు. ఓపక్క రాష్ట్ర ప్రభుత్వం వైద్యంపై ప్రభుత్వం దృష్టిసారిస్తున్నా స్థానికంగా ఉన్న వైద్యులు, వైద్య సిబ్బంది నిర్వాకంతో వైద్య వ్యవస్థ కుంటుపడుతోందని స్థానికులు చర్చించుకుంటున్నారు. జిల్లా వైద్య, ఆరోగ్య శాఖలో పాతుకపోయిన అధికారులు, సిబ్బంది నిర్లక్ష్యం కొట్టొచ్చినట్లు కన్పిస్తుందని పలు ఆరోపణలు ఉన్నా, వారికి రాజకీయ పలుకుబడి ఉండటంతో స్థానచలనం కలగడం లేదని బహిరంగంగా పేర్కొంటున్నారు. ఇప్పటికైనా జిల్లాలోని ప్రభుత్వ ఆస్పత్రులపై ఉన్నతాధికారుల పర్యవేక్షణ పెరగాలని ప్రజలు కోరుతున్నారు.

‘స్వచ్ఛత’పై అలసత్వం

స్వచ్ఛ సర్వేక్షణ్ సర్వే-2022లో వెనకబడిన జిల్లా

- మున్సిపాలిటీల్లో పారిశుద్ధ్యంపై కొరవడిన చిత్తశుద్ధి
- తక్కువ ర్యాంకింగ్‌కు కారణాలెన్నో..
- ఫైవ్ స్టార్ పొందడంలో జిల్లా యంత్రాంగం విఫలం



కల్వకుర్తి శివారులోని డంపింగ్ యార్డులో ఇలా..

అచ్చంపేట: కేంద్ర ప్రభుత్వం ప్రకటిస్తున్న స్వచ్ఛ సర్వేక్షణ్‌లో జిల్లాలోని మున్సిపాలిటీల ర్యాంకు ఏటేటా పడిపోతుంది. ప్రస్తుతం ప్రకటించిన 2022–సర్వేలో జిల్లా త్రీస్టార్ రేటింగ్‌కు పరిమితమైంది. ఇందుకు ప్రధానంగా పాలకవర్గం, అధికారులు పారిశుద్ధ్యంపై దృష్టిసారించకపోవడమే కారణమని ప్రజలు భావిస్తున్నారు. దేశవ్యాప్తంగా సౌత్ జోన్‌లో 326 మున్సిపాలిటీలు పాల్గొన్నాయి. ఇందులో జిల్లాలోని నాలుగు మున్సిపాలిటీలు ర్యాంకింగ్‌లో 25 వేల నుంచి 50 వేల జనాభా విభాగంలో నాగర్‌కర్నూల్ మున్సిపాలిటీ 55.04 శాతం, అచ్చంపేట 50.4 శాతం, కల్వకుర్తి 57.44, కొల్లాపూర్ 39.7 మార్కులు సాధించాయి. రాష్ట్రస్థాయిలో పాల్గొన్న మున్సిపాలిటీలు 23, 30, 18, 39వ స్థానాలకు పరిమితమయ్యాయి. మున్సిపాలిటీల్లో సంపూర్ణ పారిశుద్ధ్యమే లక్ష్యంగా మూడు విభాగాలుగా స్వచ్ఛ సర్వేక్షణ్ పరిశీలన ఉంటుంది. వీటితోపాటు ఈసారి సఫాయి మిత్ర సురక్ష మార్కులను సైతం పరిగణలోకి తీసుకున్నారు. మొత్తం 7,500 మార్కులకు గాను జిల్లాలోని మున్సిపాలిటీలు 50 శాతం మాత్రమే సాధించాయి. పారిశుద్ధ్య నిర్వహణలో కీలకమైన సర్వీస్ లెవల్ ప్రోగ్రెస్ విభాగంలో 43 శాతం, ప్రజాభిప్రాయ సేకరణలో 55 శాతం మార్కులు వచ్చినప్పటికీ ధ్రువీకరణ విభాగంలో కేవలం 20 శాతం మార్కులతోనే సరిపెట్టుకోవాల్సి వచ్చింది. సఫాయి కార్మికులకు అత్యాధునిక యంత్ర పరికరాలను అందుబాటులోకి తేవడంతోపాటు వారికి పీపీఈ కిట్లు, రక్షణ కవచాలు ఇస్తూ పారిశుద్ధ్య నిర్వహణలో సాంకేతికను వినియోగించాలనే లక్ష్యంతో చేపట్టిన సఫాయి మిత్ర సురక్ష పోటీల్లో రాష్ట్రస్థాయిలో ర్యాంకులు సాధించినా ఆ తర్వాత నిర్వహణపై చేతులెత్తేసింది. కార్మికులకు సబ్సిడీపై యంత్రాలు ఇప్పించడంలోనూ మున్సిపాలిటీలు విఫలమయ్యాయి. రక్షణ కవచాల పంపిణీలో నిర్లక్ష్యమే చోటుచేసుకుంది.

పడిపోయిన ధ్రువీకరణ

స్వచ్ఛ సర్వేక్షణ్ సర్టిఫికేషన్ విభాగంలో మొత్తం 7,500 మార్కులకు అచ్చంపేట మున్సిపాలిటీకి కేవలం 3,028.78 మార్కులే వచ్చాయి. ప్రధానంగా చెత్త రహిత పట్టణం (సర్వీస్ లెవల్ ప్రోగ్రెస్) కీలకం. దీనికి మొత్తం 3,000 మార్కులకు గాను 1,200 మార్కులు వచ్చాయి. సిటిజన్ వాయిస్ విభాగంలో 2,250కి 1,420, జీఎఫ్‌సీ, ఓడీఎఫ్ ప్లస్ విభాగంలో 2,250కి 400 మార్కులు మాత్రమే వచ్చాయి. ఓడీఎఫ్ ప్లస్ ధ్రువీకరణ మాత్రమే ఉండడంతో ఈ మార్కులు వచ్చాయి. జీఎఫ్‌సీ పరిశీలకులు వచ్చినప్పుడు పట్టణంలో ఎక్కడ చూసినా రోడ్లపై చెత్తకుప్పలు కనిపించడమే కారణంగా భావిస్తున్నారు.

ప్రజాభిప్రాయ సేకరణ..

స్వచ్ఛ సర్వేక్షణ్- 22లో 7,500 మార్కులు కేటాయించగా కల్వకుర్తి మున్సిపాలిటీ 3,446.78 మార్కుల (57.44 శాతం)తో జోనల్, రాష్ట్రస్థాయిలో కాస్త మెరుగ్గా నిలిచింది. ఇక్కడ ప్రజల అనుభవాల విభాగంలో 300 మార్కులకు కేవలం 260 మార్కులు రాగా మిగతా విభాగాల్లో కొంత మెరుగ్గా ఉంది. వినూత్న చర్యల్లోనూ ఆశించిన మార్కులు రాలేదు. రానున్న స్వచ్ఛ సర్వేక్షణ్‌లోనైనా మెరుగైన ర్యాంకు రావాలంటే పారిశుద్ధ్య నిర్వహణలో ప్రజలు సంతృప్తి పడేలా చర్యలు తీసుకోవాల్సి ఉంది. ప్రధానంగా ప్రజల నుంచి వచ్చే ఫిర్యాదులను ఎప్పటికప్పుడు పరిష్కరిస్తే ఈ విభాగంలో ప్రజల అభిప్రాయాలు మరింత సానుకూలంగా ఉండి మార్కులు పెరిగే అవకాశం ఉంది.

జిల్లాలోని మున్సిపాలిటీలు సాధించిన ర్యాంకులు, మార్కులు

మున్సిపాలిటీ	జోనల్ ర్యాంకు	స్టేట్ ర్యాంకు	మొత్తం మార్కులు / 7,500
నాగర్‌కర్నూల్	27	23	3,302.89
అచ్చంపేట	36	30	3,028.78
కల్వకుర్తి	20	18	3,446.78
కొల్లాపూర్	81	39	2,382.58

చెత్త సేకరణలో విఫలం

ప్రధానంగా ఇంటింటా తడి, పొడి చెత్తను వేర్వేరుగా సేకరించడం, సేకరించిన చెత్త నిర్వహణే కీలకం. తడి చెత్తతో సేంద్రియ ఎరువు తయారీ, పొడి చెత్తను పునర్వినియోగానికి తరలించడం, చెత్త తరలిస్తున్న వాహనాలను డిజిటల్ ట్రాకింగ్ విధానంలో పర్యవేక్షించడం, సఫాయి మిత్ర సురక్ష మార్గదర్శకాల అమలు, పట్టణాలను చెత్త రహితంగా తీర్చిదిదద్దడం ప్రధానాంశాలు. ఈ విభగంలో 3,000 మార్కులకు గాను అచ్చంపేట మున్సిపాలిటీకి 1,200 మార్కులే వచ్చాయి. అత్యాధునిక యంత్రాలను రూ.కోట్లు వెచ్చించి కొనుగోలు చేసినా వినియోగించకుండానే మూలన పడేశారు. తడి, పొడి చెత్త వేర్వేరుగా సేకరణ అటకెక్కింది. సేంద్రియ ఎరువు తయారీ ఊసే లేదు. ఇటీవలే పొడి చెత్తను పునర్వినియోగానికి పంపించే చర్యలకు శ్రీకారం చుట్టారు. డిజిటల్ ట్రాకింగ్ విధానం కాగితాలకే పరిమితమైంది. సఫాయి మిత్ర సురక్షలో కీలకమైన కార్మికులకు రక్షణ కవచాల పంపిణీని మున్సిపాలిటీ విస్మరించింది.



అచ్చంపేటలో చెత్త సేకరిస్తున్న ఆటోలు

ఈసారి ఉత్తమ అవార్డు సాధిస్తాం



స్వచ్ఛ సర్వేక్షణ్-23లో అచ్చంపేట మున్సిపాలిటీ ఉత్తమ అవార్డు సాధించే దిశగా అడుగులు వేస్తున్నాం. పారిశుద్ధ్యంతోపాటు తడి, పొడి చెత్త, ప్లాస్టిక్ రహిత పట్టణంగా తీర్చిదిద్దుతాం. ప్రజల ఫిర్యాదులను ఎప్పటికప్పుడు పరిష్కరిస్తున్నాం. మల, మూత్ర విసర్జన కోసం అవసరమైన చోట టాయిలెట్స్ ఏర్పాటు చేస్తున్నాం. జీఎఫ్‌సీ, ఓడీఎఫ్ ప్లస్ విభాగంలో మంచి మార్కులు సాధించేందుకు చర్యలు చేపడుతున్నాం.

– బలరాంనాయక్, మున్సిపల్ కమిషనర్, అచ్చంపేట

రెండోరోజూ 6,482 మందికి కంటి పరీక్షలు



నాగర్‌కర్నూల్ క్రైం: రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన రెండో విడత కంటివెలుగు కార్యక్రమం శుక్రవారం రెండోరోజూ ప్రశాంతంగా కొనసాగింది. జిల్లాలోని అచ్చంపేట, నాగర్‌కర్నూల్, కల్వకుర్తి, కొల్లాపూర్ నియోజకవర్గాల్లో ఏర్పాటు చేసిన కంటివెలుగు శిబిరాల్లో వైద్యసిబ్బంది 6,482 మందికి కంటిపరీక్షలు నిర్వహించారు. ఇందులో 1930 మందికి దగ్గర చూపు, దూరపు చూపు అద్దాలు పంపిణీ చేశారు. అలాగే 1,380 మందికి అవసరమయ్యే ప్రిస్క్రిప్షన్ అద్దాలను ఆన్‌లైన్‌లో వివరాలు నమోదు చేశారు. జిల్లాలో ఏర్పాటు చేసిన 50 కేంద్రాల్లో కంటి వైద్యశిబిరాల్లో అత్యధికంగా 208 మంది పెద్దకొత్తపల్లి శిబిరంలో, అత్యల్పంగా తెలకపల్లి మండలం బొప్పెల్లిలో 68 మంది కంటి పరీక్షలు చేయించుకున్నారు. కాగా వంద మందికిపైగా కంటి ఆపరేషన్లు అవసరమైన వారిని గుర్తించినట్లు వైద్యాధికారులు వెల్లడించారు. కంటివెలుగు శిబిరాలకు వచ్చే వారికి ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా అన్ని శాఖల అధికారులు సమన్వయంతో ఏర్పాట్లు చేశారు. డీఎంహెచ్‌ఓ సుధాకర్‌లాల్ జిల్లాలోని కంటివెలుగు శిబిరాలను సందర్శించి సిబ్బందికి సూచనలు చేశారు.

గడువు పొడిగింపు

కందనూలు: అంబేద్కర్ సార్వత్రిక విశ్వవిద్యాలయం పరిధిలోని ఓపెన్ డిగ్రీ మొదటి, తృతీయ, ఐదో సెమిస్టర్ పరీక్షలకు సంబంధించి పరీక్ష ఫీజు చెల్లింపునకు ఈ నెల 25 వరకు గడువు పొడిగించామని నాగర్‌కర్నూల్ అంబేద్కర్ అభ్యాసకులు, సహాయ కేంద్రం సమన్వయకర్త షేక్ ఖాజాబీ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. విద్యార్థులు ఈ నెల 25లోగా పరీక్ష ఫీజు ఆన్‌లైన్‌లో చెల్లించి పరీక్షలకు సిద్ధంగా కావాలన్నారు. వచ్చే నెల 11 నుంచి ఫస్ట్ సెమిస్టర్ పరీక్షలు, 20 నుంచి 3వ సెమిస్టర్, 27 నుంచి 5వ సెమిస్టర్ పరీక్షలు ప్రారంభమవుతాయని చెప్పారు. పూర్తి వివరాలకు సెల్ నం.73829 29779కు ఫోన్ చేయాలని కోరారు.

బాధిత కుటుంబాన్ని ఆదుకోవాలి

వెల్దండ: హైదరాబాద్‌లోని గాంధీ ఆస్పత్రిలో చికిత్స పొందుతూ మృతిచెందిన బాలింత కుటుంబాన్ని రాష్ట్ర ప్రభుత్వం ఆదుకోవాలని బీజేపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బంగారు శ్రుతి అన్నారు. శుక్రవారం మండలంలోని చెదురుపల్లిలో సిరివెన్నెల కుటుంబాన్ని ఆమె పరామర్శించారు. సిరివెన్నెల పురిటినొప్పులతో ఆస్పత్రికి వెళ్లగా వైద్యులు నిర్లక్ష్యం చేయడంతో ఆమె అనారోగ్యానికి గురైందన్నారు. మెరుగైన వైద్యం కోసం గాంధీ ఆస్పత్రికి తీసుకెళ్లి చికిత్స అందిస్తుండగా మృతిచెందడం బాధాకరమన్నారు. పసిబిడ్డకు తల్లి లేకపోవడంతో కుటుంబ సభ్యులు తల్లడిల్లిపోతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ సంఘటనకు ప్రభుత్వమే పూర్తి బాధ్యత వహించి బాధిత కుటుంబాన్ని అన్నివిధాలుగా ఆదుకోవాలని ఆమె డిమాండ్ చేశారు. మృతురాలి కుటుంబానికి జరిగిన అన్యాయాన్ని ఎస్సీఎస్సీ కమిషన్‌తో ఆమె ఫోన్‌లో మాట్లాడి వారికి న్యాయం జరిగేలా చర్యలు తీసుకోవాలని కోరారు. అనంతరం బాధిత కుటుంబానికి ఆర్థిక సహాయం అందజేశారు. కార్యక్రమంలో బీజేపీ మండలాధ్యక్షుడు విజేందర్‌రెడ్డి, ఎంపీటీసీ మాజీ సభ్యుడు శ్రీనివాసులు, ప్రధాన కార్యదర్శి రామస్వామి, శ్రీనివాస్‌చారి, కొండల్, మల్లేష్, మధుసూదన్‌రెడ్డి, అంతిరెడ్డి, వెంకటయ్య, లక్ష్మయ్య, దాసు, శ్రీను, రవికుమార్ తదితరులు పాల్గొన్నారు.

నేటి నుంచి అంజన్న బ్రహ్మోత్సవాలు



ఆంజనేయస్వామి మూలవిరాట్

ఊర్కొండ: మండలంలోని ఊర్కొండపేట ఆంజనేయస్వామి బ్రహ్మోత్సవాలు శనివారం నుంచి ప్రారంభం కానున్నాయి. ఈ నెల 28 వరకు కొనసాగే బ్రహ్మోత్సవాలకు అన్ని ఏర్పాట్లు చేశామని ఆలయ కార్యనిర్వహణాధికారి శ్రీనివాస్‌రెడ్డి తెలిపారు. ఉత్సవాల్లో భాగంగా శనివారం మొదటిరోజు ఉదయం 8 గంటలకు ఊర్కొండపేటలోని ఆలయ అర్చకుల స్వగృహం నుంచి పల్లకీసేవ నిర్వహిస్తారు. 10 గంటలకు ధ్వజారోహణం, శకటోత్సవం, ఆదివారం పంచ సూక్తులతో పూజలు, స్వామివారికి గజవాహనసేవ, ప్రదోశ పూజలు, సోమవారం తెల్లవారుజామున రథోత్సవం ఉంటుందన్నారు. మంగళవారం మన్నె సూక్తులతో పూజలు, మంగళహారతి, రాత్రి హరికథ కాలక్షేపం, బుధవారం ఉత్సవ మూర్తులకు పంచామృతాభిషేకం, అష్టోత్తర పూజలు జరిపిస్తామన్నారు. గురువారం స్వామివారికి అభిషేకం, అర్చనలు, నెమలి వాహన సేవ, శుక్రవారం స్వామివారికి అభిషేకాలు, శనివారం చక్రతీర్థ స్నానం, అభిషేకం, అష్టోత్తర నామం, మంత్ర పుష్పం నిర్వహిస్తారు. అనంతరం ఆలయం నుంచి అర్చకుల స్వగృహానికి స్వామివారి విగ్రహాల తరలింపుతో బ్రహ్మోత్సవాలు ముగుస్తాయని అధికారులు తెలిపారు.

ఏటీఆర్‌లో పర్యటిస్తే విదేశీ అనుభూతి

రాష్ట్ర అటవీ శాఖ మంత్రి ఇంద్రకరణ్‌రెడ్డి



సఫారీ వాహనంలో ఎంపీ రాములు, ఎమ్మెల్యే గువ్వల బాలరాజుతో మంత్రి ఇంద్రకరణ్‌రెడ్డి తదితరులు

మన్ననూర్/ అచ్చంపేట: విదేశాల్లో తిరిగితే వచ్చే అనుభూతి తెలంగాణలోని అమ్రాబాద్ టైగర్ రిజర్వ్ (ఏటీఆర్), కవ్వాల్ పులుల సంరక్షిత ప్రాంతాల్లో లభిస్తుందని అటవీశాఖ మంత్రి ఇంద్రకరణ్‌రెడ్డి అన్నారు. శుక్రవారం ఆయన అమ్రాబాద్ మండలం మన్ననూర్ వనమాళికలో ఎంపీ రాములు, ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే గువ్వల బాలరాజు, పీసీసీఎఫ్ డోబ్రియాల్‌తో కలిసి రూ.1.20 కోట్లతో కొనుగోలు చేసిన టూరిస్టు సఫారీ వాహనాలు, రూ.90 లక్షలతో నిర్మించిన నాలుగు కాటేజీలు, టైగర్ బుక్, టూరిస్టు ఆన్‌లైన్ బుకింగ్ యాప్‌లను ప్రారంభించారు. అనంతరం ఆయన స్థానిక విలేకరులతో మాట్లాడుతూ పర్యాటకులు విదేశాలకు వెళ్లి రూ.వేలు ఖర్చు పెడితే కలిగే అనుభూతి నల్లమలలోని అభయారణ్యంలోనే లభిస్తుందన్నారు. నల్లమలలో ఎకో టూరిజంతోపాటు శ్రీశైలం, మల్లెలతీర్థం, సలేశ్వరం, మద్దిమడుగు, ఉమామహేశ్వరం తదితర పుణ్యక్షేత్రాలు ఉన్నాయని టూరిస్టులు, పర్యాటకులను ఆకర్షిస్తున్న ప్రాంతంగా ఏటీఆర్ ఉందన్నారు. ఇప్పటికే ఫర్హాబాద్ నుంచి వ్యూ పాయింట్ వరకు సఫారీ వాహనాలు తిరుగుతున్నాయని, కొత్తగా ఉమామహేశ్వరం రుసులచెరువు వరకు 24 గంటల సఫారీ పర్యటన ఏర్పాటు చేయడం శుభపరిణామం అన్నారు.

త్వరలోనే పట్టాలు..

ఆర్‌ఓఎఫ్‌ఆర్ కింద ప్రభుత్వ ఆదేశాల మేరకు అర్హులకు త్వరలోనే పట్టాలు అందజేస్తామని, ఆ తర్వాత అటవీశాఖ సరిహద్దులు ఏర్పాటు చేస్తామని మంత్రి తెలిపారు. అభయారణ్యంలో పర్యటించిన ఆయన పులుల సంరక్షణ కోసం చేపట్టిన ఏర్పాట్లు ఎంతో సంతృప్తిని ఇచ్చినట్లు చెప్పారు. గతానికి, ప్రస్తుతానికి అటవీ పరిసర ప్రాంతాల్లో ఎన్నో మార్పులు వచ్చాయని, ఇదంతా అటవీశాఖ అధికారులు, సిబ్బంది కృషి ఫలితమే అన్నారు. అటవీ, వన్యప్రాణుల అభివృద్ధితోపాటు పర్యాటకంగా అభివృద్ధి చెందితే స్థానికులకు ఉపాధి అవకాశాలు లభిస్తాయన్నారు. ఈ ప్రాంతంలో టూరిజం అభివృద్ధికి బీజం వేసిన రిటైర్డ్ ఎఫ్‌డీ శంకరన్‌ను ఆయన ప్రశంసించారు. యురేనియం వెలికితీత గురించి అడిగిన ప్రశ్నకు సమాధానంగా అది జరగని పని.. దాని గురించి మనం మాట్లాడుకోవాల్సిన అవసరం లేదని కొట్టిపారేశారు.

ప్రజల సహకారం ఉంటేనే..

రాష్ట్ర టూరిజం డెవలప్‌మెంట్ చైర్మన్ ఒంటేరు ప్రతాప్‌రెడ్డి మాట్లాడుతూ ప్రజల సహకారం ఉంటే పచ్చదనం వెల్లివిరుస్తుందని చెప్పారు. ఎంపీ రాములు మాట్లాడుతూ అడవుల అభివృద్ధికి ప్రజల భాగస్వామ్యం ఉండేలా చర్యలు తీసుకోవాలని కోరారు. ఎమ్మెల్యే గువ్వల మాట్లాడుతూ అటవీశాఖ టోల్‌గేట్ల వద్ద స్థానికులకు సడలింపు ఇవ్వాలని, అటవీశాఖకు వచ్చే ఆదాయాన్ని టైబజార్ రూపంలో కొంత డబ్బు పంచాయతీకి చెల్లించాలని మంత్రిని కోరారు. పీసీసీఎఫ్ రాకేష్ మోహన్ డోబ్రియాల్ మాట్లాడుతూ పులులు స్వేచ్ఛగా తిరిగేందుకు నల్లమలలోని రెండు గ్రామాలను మైదాన ప్రాంతానికి తరలించేందుకు ఏర్పాట్లు జరుగుతున్నాయని చెప్పారు.



వ్యూ పాయింట్ వద్ద అధికారులతో మాట్లాడుతున్న మంత్రి ఇంద్రకరణ్‌రెడ్డి

భద్రత లేకుండానే..

అటవీశాఖ పర్యటనలో భాగంగా గురువారం రాత్రి మంత్రి మన్ననూర్‌కు చేరుకున్నారు. రాత్రి అటవీ శాఖ విశ్రాంతి గృహంలో బసచేసిన మంత్రి శుక్రవారం ఉదయం పులుల అభయారణ్య ప్రాంతమైన ఫర్హాబాద్, వ్యూ పాయింట్ ప్రాంతాల్లో కుటుంబంతో కలిసి పర్యటించారు. అయితే మంత్రి అడవిలోకి వెళ్లే సమయంలో అటవీశాఖ నిబంధనల ప్రకారం ఆయన వ్యక్తిగత భద్రత సిబ్బందితోపాటు తుపాకులను అనుమతించలేదు.

మంత్రికి వినతులు..

నల్లమలలోని ఉమామహేశ్వరం, మద్దిమడుగు వంటి పుణ్యక్షేత్రాలకు వెళ్లే రహదారుల్లో చెక్‌పోస్టులను ఎత్తివేయాలని కోరుతూ బీజేపీ నాయకులు మంత్రికి వినతిపత్రం అందజేశారు. భక్తులు, పర్యాటక ప్రియులను దృష్టిలో ఉంచుకొని చెక్‌పోస్టులను ఎత్తివేయాలని వినతిలో కోరారు. అంతకు ముందు మంత్రి అటవీశాఖ ఆధ్వర్యంలో నిర్వహించిన వివిధ రకాల పోటీల్లో విజేతలుగా నిలిచిన విద్యార్థులకు బహుమతులు అందజేశారు. అలాగే మంత్రిని మేదరి సంఘం, అటవీశాఖ మహిళా సిబ్బంది ఘనంగా సన్మానించారు. ఆయా కార్యక్రమాల్లో జెడ్పీ చైర్‌పర్సన్ శాంతకుమారి, కలెక్టర్ ఉదయ్‌కుమార్, ఎఫ్‌డీ క్షితిజ, డీఎఫ్‌ఓ రోహిత్‌రెడ్డి, ఎఫ్‌డీఓ విశాల్, ఎంపీపీ శ్రీనివాసులు, సర్పంచ్ శ్రీరాం, రైతుబంధు జిల్లా అధ్యక్షుడు మనోహర్, అచ్చంపేట మున్సిపల్ చైర్మన్ నర్సింహగౌడ్, జెడ్పీటీసీ సభ్యుడు రాంబాబు, ఎంపీటీసీ సభ్యుడు శ్రీనివాసులు, ఎఫ్‌ఆర్‌ఓలు ప్రభాకర్, ఈశ్వర్, ఆదిత్య తదితరులు పాల్గొన్నారు.

జాతర కిటకిట.. ఉర్సు కళకళ

వైభవంగా కొనసాగుతున్న ఉమామహేశ్వరం, నిరంజన్‌షావలీ వేడుకలు



రంగాపూర్ దర్గాలో మొక్కులు చెల్లించుకుంటున్న భక్తులు

అచ్చంపేట: శ్రీశైలం ఉత్తరద్వారమైన ఉమామహేశ్వర క్షేత్రంలో బ్రహ్మోత్సవాలు, జాతర వైభవంగా కొనసాగుతున్నాయి. అలాగే రంగాపూర్ నిరంజన్‌షావలీ ఉర్సు మూడోరోజు శుక్రవారం భక్తుల సందడితో కళకళలాడుతోంది. భక్తులు నిరంజన్‌షావలికి ఫాతేహాలు, కందోరీలు సమర్పించి మొక్కులు తీర్చుకున్నారు. నల్లమల కొండలపై వెలసిన పార్వతీపరమేశ్వరుల వేడుకలను తిలకించిన భక్తులు అనంతరం పూజలు నిర్వహిస్తున్నారు. పాపనాశిని గుండం వద్ద భక్తులు పుణ్యస్నానాలు ఆచరించి స్వామివారిని దర్శించుకొంటున్నారు. ఉదయం గవ్యంత పూజలు, వాస్తుపూజ, వాస్తుహోమంతోపాటు అమ్మవారికి కుంకుమార్చనలు చేస్తున్నారు. ఉత్సవాల్లో భాగంగా ఉత్తరాయణ పుణ్యకాలస్నానాలు, ప్రత్యేక పూజలను జరిపించారు. ఈ వేడుకలను ఆలయ కమిటీ చైర్మన్ సుధాకర్, కార్యనిర్వహణ అధికారి శ్రీనివాసరావు పర్యవేక్షిస్తున్నారు.


కనులపండువగా చక్రస్నానం

ఉమామహేశ్వరంలో బ్రహ్మోత్సవాల్లో శుక్రవారం నిర్వహించిన ప్రత్యేక పూజల్లో స్వామివారికి అభిషేకాలు, వసంతోత్సవం, చక్రస్నాం, పాపనాశనం వద్ద అర్చకులు వీరయ్యశాస్త్రి ఆధ్వర్యంలో త్రిశూల స్నానాలు జరిపారు. ఉమామహేశ్వరం, ఉర్సులో ఎలాంటి అవాంఛనీయ ఘటనలు జరగకుండా అచ్చంపేట సీఐ అనుదీప్ ఆధ్వర్యంలో ఎస్‌ఐలు గోవర్ధన్, గురుస్వామి పోలీస్ బందోబస్తు ఏర్పాటు చేశారు. పోలీసుల నిఘా కట్టుదిట్టం చేస్తూ సివిల్ పోలీసులతో బందోబస్తు కల్పిస్తున్నారు. డీఎస్పీ, సీఐ స్వయంగా బందోబస్తును పరిశీలిస్తూ ట్రాఫిక్ సమస్య తలెత్తకుండా చూస్తున్నారు.



ఉమామహేశ్వరం వద్ద క్యూలైన్‌లో భక్తులు

బెదిరింపులకు దిగితే తరిమికొడతాం



మాట్లాడుతున్న నాగం జనార్దన్‌రెడ్డి

కందనూలు: కాంగ్రెస్ పార్టీకి చెందిన దళిత, గిరిజన నాయకులపై జరిగిన దాడిని నిరసిస్తూ ఈ నెల 22న బిజినేపల్లిలో నిర్వహించే దళిత, గిరిజన ఆత్మగౌరవ సభను అడ్డుకునేందుకు స్థానిక ఎమ్మెల్యే సభకు హాజరుకాకూడదని బెదిరింపులకు దిగితున్నారని, తమ నాయకులను బెదిరిస్తే తరిమికొడతామని మాజీ మంత్రి నాగం జనార్దన్‌రెడ్డి అన్నారు. శుక్రవారం జిల్లాకేంద్రంలోని తన నివాసంలో ఆయన విలేకరులతో మాట్లాడారు. మర్రి జనార్దన్‌రెడ్డి ఒక నియంత అని, తన స్వార్థం కోసం దళిత, గిరిజనులను వాడుకుంటున్నారని ఆరోపించారు. తమ హక్కుల సాధన కోసం కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో సభ ఏర్పాటు చేసుకుంటే దానిని అడ్డుకునేందుకు శత విధాలుగా ప్రయత్నిస్తున్నారని, ఎన్ని కుట్రలు చేసిన ఆత్మగౌరవ సభ జరిపి తీరుతామని చెప్పారు. ఎమ్మెల్యే నియోజకవర్గంలో సాగిస్తున్న అకృత్యాలను ప్రజలకు వివరిస్తామనే ఉద్దేశంతోనే తమ పార్టీ నాయకులను రెచ్చగొట్టేలా వ్యవహరిస్తున్నారని ఆరోపించారు. దళిత గిరిజన ఆత్మగౌరవ సభను విజయవంతం చేసేందుకు వేలాదిగా కార్యకర్తలు తరలిరావాలని కోరారు. సమావేశంలో జిల్లా ప్రధాన కార్యదర్శి అర్థం రవి, జెడ్పీటీసీ సభ్యురాలు రోహిణి తదితరులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

వేధింపులు భరించలేక వివాహిత ఆత్మహత్య


మంజుల(ఫైల్)

మహబూబ్‌నగర్ క్రైం: అప్పు తీసుకున్న వ్యక్తులు డబ్బులు ఇవ్వకపోగా..పైగా వాళ్ల కోరిక తీర్చాలని వేధించడం వల్ల ఓ వివాహిత ఇంట్లో ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకుంది. రూరల్ ఎస్‌ఐ వెంకటేశ్వర్లు కథనం ప్రకారం.. మండల పరిధిలోని గాజులపేటకి చెందిన మంజుల(28) శుక్రవారం మధ్యాహ్నం ఇంట్లో ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకుంది. అయితే మృతురాలు మంజుల గాజులపేట గ్రామంలో కిరాణం, చిన్న హోటల్ నడుపుతూ జీవనం సాగిస్తోంది. ఈ క్రమంలో అదే గ్రామానికి చెందిన మజ్జిగ మల్లేష్, దొడ్డన శేఖర్‌లు కలిసి మంజుల దగ్గర రూ.50వేలు నగదు అప్పుగా తీసుకున్నారు. కొన్ని రోజులకు మంజుల తిరిగి డబ్బులు అడిగితే.. తన కోరిక తీరిస్తే నీ డబ్బులు ఇస్తానని లేకపోతే ఇవ్వనని మజ్జిగ మల్లేష్ బెదిరించాడు. ఈనెల 16న మంజుల ఇంటికి మల్లేష్, శేఖర్ వెళ్లి ఆమెపై దాడి చేస్తున్న క్రమంలో.. మంజుల కొడుకు ఇంటికి వచ్చాడు. దీంతో వారిద్దరూ అక్కడి నుంచి వెళ్లిపోతూ ఈ విషయం ఇతరులకు చెబితే అందరిని చంపుతామని బెదిరించి వెళ్లారు. దీంతో మంజుల ఇచ్చిన డబ్బులు రాకపోవడంతో పాటు పరువు పోతుందని ఆత్మహత్య చేసుకుంది. మృతురాలికి ఒక కొడుకు, ఒక కూతురు, భర్త ఉన్నారు. మృతురాలి తండ్రిరాములు ఇచ్చిన ఫిర్యాదు మేరకు మల్లేష్, శేఖర్‌లపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ తెలిపారు.

చికిత్స పొందుతూ వ్యక్తి మృతి


యూసూఫ్ (ఫైల్)

మిడ్జిల్: మండలంలోని మున్ననూర్ టోల్‌గేట్ వద్ద గురువారం మధ్యాహ్నం జరిగిన రోడ్డు ప్రమాదంలో రాణిపేటకు చెందిన యుసూఫ్ (38)కు తీవ్ర గాయాలయ్యాయి. వెంటనే స్థానికులు చికిత్స నిమిత్తం మహబూబ్‌నగర్ ఆస్పత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ శుక్రవారం ఉదయం మృతిచెందినట్లు ఎస్‌ఐ రాంలాల్ నాయక్ తెలిపారు. కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి పోస్టుమార్టం అనంతరం మృతదేహాన్ని కుటుంబ సభ్యులకు అప్పగించామన్నారు. యూసూఫ్‌కు భార్య సాబేరా బేగం, ముగ్గురు కుమార్తెలు, ఒక కుమారుడు ఉన్నట్లు స్థానికులు తెలిపారు.

పాలమూరులో దొంగల హల్‌చల్

- చెడ్డీగ్యాంగ్‌గా స్థానికుల అనుమానం?


కెమెరాలో రికార్డయిన దొంగల విజువల్స్

మహబూబ్‌నగర్ క్రైం/జడ్చర్ల టౌన్: జిల్లాకేంద్రంలోని శివారు కాలనీల్లో గుర్తు తెలియని దొంగలు సంచారిస్తున్నారు. ప్రధానంగా బృందవన్ కాలనీలో శుక్రవారం తెల్లవారుజామున ముగ్గురు వ్యక్తులు రవిశంకర్ అనే వ్యక్తి ఇంట్లోకి ప్రవేశించారు. అతను కేకలు వేయడంతో అక్కడి నుంచి పారిపోయారు. దొంగతనానికి వచ్చిన వ్యక్తుల దృశ్యాలు సీసీ కెమెరాల్లో రికార్డ్ అయ్యాయి. అదే ఏరియాలో రెండు రోజుల కిందట శాంతయ్య అనే వ్యక్తి ఇంట్లో దొంగతనం జరిగినట్లు తెలుస్తోంది. వెంకటేశ్వర కాలనీ, బృందవన్ కాలనీ ఏరియాల్లో మూడు రోజుల నుంచి ఆరుగురు వ్యక్తులు అర్ధరాత్రి వేళ సంచారిస్తున్నట్లు స్థానికులు చెబుతున్నారు. దొంగతనాల కోసం తిరుగుతున్న వ్యక్తులు చెడ్డీ గ్యాంగ్‌గా స్థానికులు అనుమానిస్తున్నారు. దీనిపై రూరల్ ఎస్‌ఐ వెంకటేశ్వర్లును వివరణ కోరగా ఎలాంటి దొంగతనాలు జరగలేదని, సీసీ కెమెరాలు పరిశీలిస్తున్నామని, వచ్చిన వాళ్లు ఎవరూ అనే విషయంపై ఆరా తీస్తున్నట్లు తెలిపారు.

- బాదేపల్లి పట్టణం సత్యనారాయణస్వామి దేవాలయం సమీపంలో సుదర్శన్‌గుప్త అపార్ట్‌మెంట్ వద్ద చెడ్డీలు వేసుకున్న దొంగలు హల్‌చల్ చేశారు. గేటు దూకి లోపలకు వచ్చి ఓ గది తలుపు విరగగొట్టి అందులో ఉన్న బ్యాగ్‌ను మాత్రమే ఎత్తుకెళ్లారు. బ్యాగులో ల్యాప్‌టాప్ ఉన్నప్పటికీ దానిని పక్కన పారవేసి బ్యాగ్ మాత్రమే ఎత్తుకెళ్లారు. చెడ్డీలు వేసుకున్న నలుగురు దొంగలు గేటు దూకటం అటు ఇటు తిరగటం సీసీ కెమెరాలో రికార్డయ్యింది. ఘటనకు సంబంధించి సీఐ రమేష్‌బాబు వివరణ ఇస్తూ పోలీసులు గస్తీ తిరుగుతున్న సమయంలోనే దొంగలు పారిపోయారని, అపార్ట్‌మెంట్ వాసులను అప్రమత్తం చేయటంతో పాటు అనుమానాస్పద వ్యక్తులు ఎవరు వచ్చినా వెంటనే సమాచారం ఇవ్వాలని చెప్పారు. అయితే సీసీ కెమెరా విజువల్స్, ఫొటోలు సామాజిక మీడియాలో వైరల్ కావటంతో చెడ్డీగ్యాంగ్ తిరుగుతుంది జాగ్రత్తగా ఉండండి అంటూ కామెంట్స్ పెడుతున్నారు.

స్తంభించిన విక్రయాలు

- బాదేపల్లి మార్కెట్‌యార్డులో కమీషన్ ఏజెంట్, వ్యాపారి మధ్య గొడవ
- టెండర్లు వేయని వ్యాపారులు
- ఇబ్బందులు పడిన రైతులు


బాదేపల్లి మార్కెట్‌కు విక్రయానికి వచ్చిన వేరుశనగ

జడ్చర్ల: బాదేపల్లి వ్యవసాయ మార్కెట్‌యార్డులో శుక్రవారం పంట ఉత్పత్తుల క్రయ విక్రయాలు స్తంభించిపోయాయి. వ్యాపారి, కమీషన్ ఏజెంట్ మధ్య జరిగిన చిన్నగొడవ ఇందుకు కారణమైంది. ఫలితంగా యార్డుకు వచ్చిన రైతులు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. చివరకు ఈ విషయం మీడియాకు తెలియడంతో పాలకులు, అధికారులు దిగొచ్చి సమస్యను తాత్కాలికంగా పక్కనబెట్టి టెండర్లు వేయాలని ఆదేశించడంతో వ్యాపారులు ముందుకు కదలారు. దీంతో మధ్యాహ్నం వెలువడాల్సిన ధరలు సాయంత్రానికి వచ్చాయి. తరువాత తూకాల ప్రక్రియ ముగిసే సరికి చీకటి పడింది.

ఇదీ కారణం..
రెండునెలల కిందట శరణబసప్ప అనే కమీషన్ ఏజెంట్ దగ్గర ఎల్‌కేటీకి చెందిన వ్యాపారి గోవింద్ టెండర్ వేసి పత్తి కొనుగోలు చేశారు. గుమాస్తా పొరపాటుతో కొనుగోలు చేసిన పత్తి లాట్‌తో పాటు ఇతరుల పత్తి లాట్‌ను కూడా గోవింద్ తీసుకెళ్లినట్లు కమీషన్ ఏజెంట్ ఆరోపించారు. దీంతో ఇద్దరి మధ్య 1.76 క్వింటాళ్ల పత్తి వ్యత్యాసం రావడంతో ఈ విషయాన్ని కమీషన్ ఏజెంట్ యూనియన్ దృష్టికి తీసుకెళ్లగా వ్యాపారి గోవింద్‌కు ధరలు ఖరారు చేసే టెండర్ ఫారాలు ఇవ్వొద్దని నిర్ణయించారు. తోటి వ్యాపారులు గోవింద్‌కు మద్దతు తెలుపుతూ శుక్రవారం టెండర్ ప్రక్రియ నిలిపివేయడంతో క్రయ విక్రయాలు స్తంభించిపోయాయి.

రైతుల అవస్థలు..
రోజు ఉదయం 11 నుంచే టెండర్ ప్రక్రియ ప్రారంభం కావాల్సి ఉండగా శుక్రవారం మధ్యాహ్నం 3 అయినా మొదలు కాలేదు. ఆకస్మికంగా టెండర్ల ప్రక్రియ నిలిపివేయడంతో రైతులు పడిగాపులు పడాల్సిన పరిస్థితి నెలకొంది. శనివారం అమావాస్య, ఆదివారం సెలవురోజు కావడంతో కుప్పల వద్ద ఉండాల్సిన పరిస్థితి నెలకొంటుందని ఆందోళన చెందారు.

సమీక్షించిన మార్కెట్‌యార్డు చైర్మన్..
మార్కెట్‌యార్డు చైర్మన్ గోవర్ధన్‌రెడ్డి హైదరాబాద్‌లో ఉండి సమస్యపై ఆరా తీశారు. కార్యదర్శి నవీన్ ఇతర వ్యాపారులు, కమీషన్ ఏజెంట్లతో ఫోన్‌లో మాట్లాడి అందరం కలిసి సమస్యను పరిష్కరించుకుందామని.. టెండర్లు వేయాలని ఆదేశించారు. రైతులను ఇబ్బందులకు గురిచేస్తే సహించేది లేదని హెచ్చరించారు. దీంతో వ్యాపారులు టెండర్లు వేయడంతో రైతులు ఊపిరి పీల్చుకున్నారు.

పడిగాపులు పడ్డాం..



పండిన 12 క్వింటాళ్ల కందిని విక్రయించేందుకు మార్కెట్‌కు వచ్చా. కానీ టెండర్లు వేయకపోవడంతో ఆందోళన చెందాల్సి వచ్చింది. రైతులను ఇబ్బందులకు గురి చేయడం సరికాదు. – తాండ్ర మల్లయ్య, గోవిందపల్లి, కల్వకుర్తి

రైతులను ఇబ్బందులకు గురిచేయొద్దు



సుమారు 300 బస్తాల వేరుశనగను విక్రయించేందుకు మార్కెట్‌కు తీసుకొచ్చా. టెండర్లు వేయకపోవడంతో కుప్ప వద్దే పడిగాపులు పడాల్సిన పరిస్థితి నెలకొంది. ఈ రోజు కొనుగోళ్లు జరగకపోతే మరో రెండురోజులు అవస్థలు పడేవాళ్లం. రైతులను ఇబ్బందులకు గురి చేయొద్దు. – బాల్‌నాగయ్య, కోడుపర్తి, జడ్చర్ల

వైద్యుల నిర్లక్ష్యంతో వ్యక్తి మృతి

- ఆస్పత్రిలో మృతుని బంధువుల ఆందోళన


అచ్చంపేట ఆస్పత్రిలో ఆందోళన చేపట్టిన మృతుని బంధువులు

అచ్చంపేట రూరల్: వైద్యుల నిర్లక్ష్యంతో షేక్ షావలీ(58) మృతి చెందిన సంఘటన అచ్చంపేట ప్రభుత్వ ఆస్పత్రిలో చోటు చేసుకుంది. అచ్చంపేట ఇందిరానగర్ కాలనీకి చెందిన షేక్ షావలీ అనారోగ్యంతో శుక్రవారం ఆస్పత్రికి వచ్చాడు. గంట పాటు వేచి ఉన్నా.. ఎవరూ పట్టించుకోలేదని మృతుని బంధువులు ఆరోపించారు. డ్యూటీలోని నర్సు చంద్రకళ షేక్‌షావలీని పరీక్షించి డ్యూటీలోని డాక్టర్ బాల్‌సింగ్‌కు సమాచారం ఇచ్చింది. షుగర్ టెస్ట్ జరిపిన కొద్ది సమయానికే అతను మృతిచెందాడు. డ్యూటీ డాక్టర్ నిర్లక్ష్యం కారణంగానే మృతి చెందాడని, డాక్టర్‌పై చర్యలు తీసుకోవాలని మృతుని కుటుంబ సభ్యులు ఆందోళన చేపట్టారు.

మహిళ కాన్పు కోసం వచ్చి..
ఈ మధ్యకాలంలో అమ్రాబాద్ మండలానికి చెందిన ఓ మహిళ కాన్పు కోసం వచ్చి ఉమ్మడి జిల్లాలోని ఐదు ఆస్పత్రులు తిరిగినా సకాలంలో వైద్యం అందక తల్లీబిడ్డ మృతిచెందారు. ఈ సంఘటన మరువక ముందే వ్యక్తి మృతిచెందడంతో ఆస్పత్రిలోని రోగులు తీవ్ర ఆందోళనకు గురవుతున్నారు. విషయం తెలుసుకున్న డీసీసీ అధ్యక్షుడు డాక్టర్ వంశీకృష్ణ ఆస్పత్రికి చేరుకుని సంఘటనకు సంబంధించిన వివరాలు తెలుసుకున్నారు. విధులపై నిర్లక్ష్యం వహించిన వైద్యులపై ఉన్నతాధికారులకు నివేదిక ఇవ్వాలని ఆయన కోరారు. వ్యక్తి మృతిపై ఆస్పత్రి సూపరింటెండెంట్ ప్రభును వివరణ కోరగా.. ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేస్తామన్నారు.

'కారుణ్య మరణానికి అనుమతివ్వండి'



జడ్చర్ల: మా భూమి మాకే దక్కేలా చూడాలని.. లేదంటే కారుణ్య మరణం పొందేందుకు అనుమతివ్వాలంటూ ఓ బాధిత కుటుంబం శుక్రవారం హైదరాబాద్‌లో మానవ హక్కుల కమిషన్‌ను ఆశ్రయించింది. వారి కథనం మేరకు.. మండలంలోని శిఖర్‌గానిపల్లికి చెందిన వెంకటమ్మ వ్యవసాయం చేస్తూ జీవనం సాగిస్తోంది. ఇటీవల ఆమె భర్త మృతిచెందగా ఆ భూమిని అదే గ్రామానికి చెందిన నర్సింహస్వామి బలవంతంగా ఆక్రమించారని.. జడ్చర్ల పోలీసులకు ఫిర్యాదు చేసినా న్యాయం జరగడం లేదని తెలిపారు. ఆక్రమణదారులకు అధికార పార్టీ అండ ఉందని.. దీంతో పోలీసులు సహకరించడం లేదని ఆరోపించారు.

మహవీర్ పరిశ్రమ నిబంధనలు పాటించడం లేదు

- కాలుష్య నియంత్రణ మండలి ఏఈ సంగీతలక్ష్మి


మాట్లాడుతున్న ఏఈ సంగీతలక్ష్మి

బాలానగర్: మండలంలోని గుండేడ్ శివారులో ఉన్న మహవీర్ పరిశ్రమను శుక్రవారం కాలుష్య నియంత్రణ మండలి అసిస్టెంట్ ఇంజినీర్ సంగీతలక్ష్మి ఆకస్మికంగా తనిఖీ చేశారు. సర్పంచ్ నర్సింహారెడ్డి ఫిర్యాదుతో పాటు పత్రికల్లో వచ్చిన కథనాలకు స్పందించి వచ్చామన్నారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. పరిశ్రమలో కాలుష్యాన్ని నియంత్రించేందుకు ఏర్పాటుచేసిన పరికరాలేవీ పని చేయడం లేదని తెలిపారు. పంటలపై ప్రభావం చూపి నాణ్యత లోపించి దిగుబడి తక్కువగా వస్తుందని.. ఇతర పరిశ్రమల వారు కూడా ఇబ్బందులు పడతారని వివరించారు. కనీస నియమాలు పాటించకపోవడంతో కార్మికుల దుస్తులు, బూట్లు కూడా నల్లగా మారుతున్నాయని తెలిపారు. వాయు కాలుష్యంతో శ్వాసకోస వ్యాధులతో ఇబ్బందులు పడుతున్నామని గ్రామస్తుడు శ్రీశైలం ఆమె దృష్టికి తీసుకొచ్చారు. చాలామంది రూ.వేలలో ఆస్పత్రులకు ఖర్చు చేసుకున్నారని, మూగజీవాలు సైతం రోగాలబారిన పడ్డాయని వివరించారు. ఆందోళనలు చేసినా పట్టించుకోడం లేదని.. న్యాయం చేయాలని కోరారు. ప్రజా శ్రేయస్సు కోసం పరిశ్రమను వెంటనే మూసివేయాలని వార్డు సభ్యుడు శ్రీనివాస్ కోరారు.

చెరుకు తోట దగ్ధం: రూ.3 లక్షల ఆస్తినష్టం



అమరచింత: పట్టణ శివారులో సాగుచేసిన చెరుకు తోట ప్రమాదవశాత్తు దగ్ధమై రూ.3 ఆస్తినష్టం వాటిల్లింది. పట్టణానికి చెందిన వార్డెన్ ప్రకాష్ ఐదు ఎకరాల్లో చెరుకు పంట సాగుచేశాడు. ప్రస్తుతం పంట కోతలు జరుగుతుండగా.. శుక్రవారం మధ్యాహ్నం చెరుకు తోటలో ఉన్న విద్యుత్ స్తంభాల తీగలు తగిలి.. నిప్పురవ్వలు రాలిపడటంతో మంటలు వ్యాపించాయి. దీంతో తోటలోని డ్రిప్ పరికరాలు పూర్తిగా కాలిపోయాయని తెలిపారు. సమాచారం అందుకున్న అగ్నిమాపక శాఖ అధికారులు వచ్చి మంటలు ఆర్పినా ఫలితం లేకపోయింది. బాధిత రైతును ఫ్యాక్టరీ యాజమాన్యం ఆదుకోవాలని కృష్ణవేణి చెరుకు రైతు సంఘం ఉమ్మడి జిల్లా అధ్యక్షుడు రాజన్న డిమాండ్ చేశారు.

ఓటమి భయంతోనే పార్టీ పేరు మార్పు


మాట్లాడుతున్న ప్రేమేందర్‌రెడ్డి

పాలమూరు: బీఆర్‌ఎస్ పార్టీ నిర్వహించిన ఖమ్మం సభకు హాజరైంది.. లిక్కర్ కుంభకోణంలో సంబంధం ఉన్న సీఎంలే అని, రానున్న అసెంబ్లీ ఎన్నికల్లో ఓటమి భయంతోనే సీఎం కేసీఆర్ టీఆర్‌ఎస్‌ను బీఆర్‌ఎస్‌గా మార్చారని బీజేపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ప్రేమేందర్‌రెడ్డి అన్నారు. మహబూబ్‌నగర్‌లోని పార్టీ జిల్లా కార్యాలయంలో శుక్రవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. రాష్ట్ర ప్రభుత్వం ప్రజలకు ఎన్నికల్లో ఇచ్చిన హామీలు అమలు చేయడంలో పూర్తిగా విఫలమైందన్నారు. బీఆర్‌ఎస్‌తో దేశం మొత్తంలో మార్పు తీసుకువస్తానని కేసీఆర్ పగటి కలలు కంటున్నారని విమర్శించారు. కమ్యూనిస్టు పార్టీల నేతలు మొన్నటి వరకు బీఆర్‌ఎస్‌ను దూషించి, ఇప్పుడు కేవలం బీజేపీని ఓడించడానికి బీఆర్‌ఎస్‌తో జతకట్టామని చెబుతుండటం చూస్తుంటే ప్రజల సమస్యలపైన వారికి ఉన్న చిత్తశుద్ధి అర్థమవుతుందన్నారు. రాష్ట్రంలో మూతబడిన చక్కెర ఫ్యాక్టరీపై మాట్లాడకుండ విశాఖ ఉక్కుపై మాట్లాడటం విడ్డూరంగా ఉందన్నారు. కృష్ణాజలాల పంపకంలో 219 టీఎంసీలకు ఎందుకు సంతకం చేశారని, కృష్ణా జలాల సమస్య పరిష్కారం కోసం ఏర్పాటు చేసిన అపెక్స్ కమిటీ సమావేశానికి ఎందుకు వెళ్లడం లేదని ప్రశ్నించారు. తెలంగాణలో టీఆర్‌ఎస్, కాంగ్రెస్ కలిసి అధికారాన్ని పంచుకున్నాయని, ప్రస్తుతం టీఆర్‌ఎస్, ఎంఐఎం కలిసి అధికారంలో ఉన్నట్లు తెలిపారు. సమావేశంలో పార్టీ జిల్లా అధ్యక్షుడు వీరబ్రహ్మచారి, రాష్ట్ర కార్యవర్గ సభ్యులు పద్మజారెడ్డి, బాలరాజు, జిల్లా ఇన్‌చార్జ్ భరత్‌గౌడ్, పాలమూరు పార్లమెంట్ కన్వీనర్ పవన్‌కుమార్‌రెడ్డి, చంద్రశేఖర్, ఎగ్గని నర్సింహులు, సత్యం, కృష్ణవర్ధన్‌రెడ్డి, సంబిరాజు తదితరులు పాల్గొన్నారు.

24 రాష్ట్ర కార్యవర్గ సమావేశం
మహబూబ్‌నగర్‌లోని అన్నపూర్ణ గార్డెన్‌లో ఈ నెల 24న బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సమావేశం నిర్వహిస్తున్న నేపథ్యంలో ఈ కార్యక్రమం ఏర్పాట్లపై ప్రేమేందర్‌రెడ్డి అధ్యక్షతన సన్నాహక సమావేశం శుక్రవారం బీజేపీ పార్టీ కార్యాలయంలో నిర్వహించారు. రాష్ట్ర కార్యవర్గ సమావేశానికి తెలంగాణ రాష్ట్ర ఇన్‌చార్జ్ తరుణ్‌చుగ్, బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు బండి సంజయ్, కేంద్రం మంత్రి కిషన్‌రెడ్డి హాజరవుతున్నట్లు సమాచారం.

రేషన్ బియ్యం పట్టివేత



మరికల్: మండల కేంద్రంలో ఓ వ్యక్తి ఇంట్లో నిల్వ చేసిన బియ్యంతో పాటు ఆటోలో తరలిస్తున్న రేషన్ బియ్యం తరలిస్తున్నారని సమాచారం రావడంతో ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారులు శుక్రవారం దాడులు నిర్వహించి 29.50 క్వింటాళ్ల రేషన్ బియ్యంను పట్టుకున్నారు. మీ బియ్యాన్ని మరికల్‌లో మూడు రేషన్ దుకాణాలకు తరలించారు. అక్రమంగా బియ్యం తరలించిన వ్యక్తిపై కేసు నమోదు చేసినట్లు ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారి కాళప్ప తెలిపారు.

శ్రీపురంలో..
నాగర్‌కర్నూల్ క్రైం: ఆటోలో అక్రమంగా తరలిస్తున్న ఆరు క్వింటాళ్ల రేషన్‌బియ్యాన్ని నాగర్‌కర్నూల్ మండలం శ్రీపురం గ్రామసమీపంలో పట్టుకున్నారు. కొల్లాపూర్ మండలం నార్లపల్లి గ్రామానికి చెందిన బాలకృష్ణ తూడుకుర్తి నుంచి రేషన్‌బియ్యాన్ని తీసుకువస్తుండగా సమాచారం అందుకున్న పోలీసులు శ్రీపురం సమీపంలో ఆటోను తనిఖీచేసి బియ్యాన్ని స్వాధీనం చేసుకున్నారు. ఈ ఘటనపూ కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేపట్టినట్లు ఎస్‌ఐ విజయ్‌కుమార్ తెలిపారు.

విముక్త, సంచార జాతుల సంక్షేమానికి కృషి


మాట్లాడుతున్న తురక నర్సింహ

జెడ్పీసెంటర్ (మహబూబ్‌నగర్): విముక్త, సంచార జాతుల సంక్షేమానికి ప్రతిఒక్కరు కృషి చేయాలని విముక్త జాతులు, సంచార జాతుల కేంద్ర సంక్షేమ బోర్డు దక్షిణ భారతదేశ సభ్యుడు తురక నర్సింహ అన్నారు. శుక్రవారం కలెక్టరేట్‌లో కలెక్టర్ వెంకట్రావ్, ఎస్పీ వెంకటేశ్వర్లుతో కలిసి జిల్లా అధికారులతో సమీక్షించారు. విద్య ద్వారానే విముక్త, సంచార జాతులు అభివృద్ధి చెందుతాయన్నారు. అందువల్ల వారికి విద్యను అందించాలన్నారు. సమష్టి కృషితో కింది జాతులు అభివృద్ధి చెందుతాయన్నారు. కలెక్టర్ వెంకట్రావ్ జిల్లాలో విముక్త, సంచార జాతుల సంక్షేమానికి తీసుకున్న చర్యల గురించి, ఎస్పీ వెంకటేశ్వర్లు శాంతిభద్రతల గురించి వివరించారు. అంతకుముందు బోర్డు సభ్యులు నర్సింహకు కలెక్టర్ ఇతర అధికారులు ఘనంగా స్వాగతం పలికారు. కార్యక్రమంలో అదనపు కలెక్టర్లు తేజాస్ నందులాల్ పవార్, సీతారామారావు, ఏఎస్పీ రాములు తదితరులు పాల్గొన్నారు.

క్రికెట్ ఆడుదాం.. ప్రతిభను చాటుదాం

ఈ నెల 22 సాక్షి ప్రీమియర్ లీగ్ క్రికెట్ టోర్నీ ఎంట్రీలకు చివరి తేదీ

బ్యాట్ పట్టుకొని బంతిని బౌండరీ దాటించాలని ఉందా? బుల్లెట్ వేగంతో బంతులు వేస్తూ వికెట్లను గిరాటేయాలని ఉందా? మెరుపు వేగంతో కదులుతూ బ్యాటర్లను రనౌట్ చేయాలని ఉందా? క్రికెట్ ఆడేద్దామని.. మనలోని ప్రతిభను ప్రపంచానికి చాటి చెప్పాలని మనసులో బలమైన కోరిక ఉంటే సరిపోదు.. దానికి వేదిక కూడా కావాలిగా! ఇలాంటి ఔత్సాహిక క్రికెటర్లు తమ కలలు నెరవేర్చుకునేందుకు మళ్లీ సమయం వచ్చేసింది. మరో ఆలోచన లేకుండా ముందుగా మీ జట్టును తయారు చేసుకొని ఎంట్రీలు పంపించండి.. ఆ తర్వాత సమరానికి సై అనండి.

Regional sponsor
SUDHAKAR PIPES AND FITTINGS
LEADER IN QUALITY AND TECHNOLOGY

ఔత్సాహిక క్రికెటర్లకు సువర్ణావకాశాలు కల్పించాలనే సదుద్దేశంతో సాక్షి మీడియా గ్రూప్ ఆధ్వర్యంలో ఈ నెల(జనవరి) నాలుగో వారంలో సాక్షి ప్రీమియర్ లీగ్ (ఎస్‌పీఎల్) క్రికెట్ టోర్నీ నాలుగో సీజన్ మొదలుకానుంది.

టోర్నీ ఫార్మాట్..
ముందుగా జిల్లా, ప్రాంతీయ, రాష్ట్ర స్థాయిలో నాకౌట్ పద్ధతిలో మ్యాచ్‌లు జరుగుతాయి. ఈ మ్యాచ్‌లను 10 ఓవర్లపాటు నిర్వహిస్తారు. జిల్లా స్థాయిలో విజేతగా నిలిచిన జట్లు ప్రాంతీయ స్థాయి టోర్నీకి అర్హత సాధిస్తాయి. ఈ మ్యాచ్‌లను 20 ఓవర్లపాటు నిర్వహిస్తారు. ప్రాంతీయ స్థాయి టోర్నీ విజేతలు రాష్ట్ర స్థాయిలో రౌండ్ రాబిన్ లీగ్ పద్ధతిలో టైటిల్ కోసం తలపడతాయి. ఉమ్మడి జిల్లాలే ప్రాతిపదికగా ఎంట్రీలు స్వీకరిస్తారు.

ఎంట్రీ ఫీజు..
ఈ టోర్నీలో పాల్గొనాలనుకునే జట్లు రూ.1,500 ఎంట్రీ ఫీజుగా చెల్లించాల్సి ఉంటుంది. ఈ మొత్తాన్ని ఆన్‌లైన్‌లోనూ, ఆఫ్‌లైన్ పద్ధతిలోనూ చెల్లించవచ్చు. వివరాలకు సాక్షి జిల్లా యూనిట్ కార్యాలయంలో సంప్రదించాలి. https://www.arenaone.in/registration వెబ్‌సైట్‌లోనూ వివరాలు లభిస్తాయి. ఎంట్రీలను ఈ నెల 22తేదీలోపు పంపించాలి.

ఏ ఏ విభాగాల్లో...
ఈ లీగ్‌ను రెండు కేటగిరీల్లో నిర్వహిస్తారు. అండర్–19 జూనియర్ స్థాయిలో (1 జనవరి 2003 తర్వాత జన్మించి ఉండాలి). అండర్–25 సీనియర్ స్థాయిలో (1 జనవరి 1997 తర్వాత జన్మించి ఉండాలి) వేర్వేరుగా నిర్వహిస్తారు. జూనియర్ స్థాయిలో ఆడేందుకు జూనియర్ కాలేజీ జట్లకు, సీబీఎస్‌ఈ స్కూల్ (ప్లస్ 1, 2) జట్లకు, ఐటీఐ, పాలిటెక్నిక్ జట్లకు అర్హత ఉంది. సీనియర్ స్థాయిలో ఆడేందుకు డిగ్రీ, పీజీ, మెడిసిన్, ఇంజనీరింగ్, ఫార్మా కాలేజీ జట్లకు అవకాశం కల్పిస్తారు.

ఎన్ని జట్లకు అవకాశం..
ఒక్కో కాలేజీ నుంచి గరిష్టంగా రెండు జట్లను పంపించే వెసులుబాటు ఉంది. రెండు జట్లు కూడా వేర్వేరుగా ఎంట్రీ ఫీజు చెల్లించాలి. ఒక జట్టులో ఆడే ఆటగాడు మరో జట్టుకు ఆడకూడదు. మ్యాచ్‌లు ఆడే సమయంలో ఆటగాళ్ల వయసు ధ్రువీకరణ పత్రాలను చూపించాల్సి ఉంటుంది. మ్యాచ్ సమయంలో ఇరుజట్ల ఆటగాళ్లు తమ కళాశాల గుర్తింపు కార్డు (ఒరిజినల్) చూపించాలి. మ్యాచ్ జరిగే సమయంలో బ్యాటర్స్, వికెట్ కీపర్ తప్పనిసరిగా హెల్మెట్లు, లెగ్ ప్యాడ్‌లు, అండర్ గార్డ్స్, హ్యాండ్ గ్లౌవ్స్, వైట్ డ్రెస్, వైట్ షూస్ ధరించాలి.
గమనిక: అన్ని విషయాల్లో నిర్వాహకులదే తుది నిర్ణయం.

ఇతర వివరాలకు నిర్వాహకులను సంప్రదించాల్సిన ఫోన్ నంబర్లు: 9010234478, 9951602829, 9705346172. వేదిక: ఎండీసీఏ మైదానం, పిల్లలమర్రి రోడ్డు, మహబూబ్‌నగర్

అర్ధరాత్రి దారి దోపిడీ

- రాయచూర్ నుంచి వస్తున్న బొలెరో వాహనం అడ్డగింత
- అందులోని గుట్కా ప్యాకెట్లను ఎత్తికెళ్లిన దండుగులు
- సంఘటనా స్థలాన్ని పరిశీలించిన డీఎస్పీ
- ఆరా తీసిన ఎస్పీ


పోతులపాడు స్టేజీ వద్ద పరిశీలిస్తున్న డీఎస్పీ

అలంపూర్: అంతర్ రాష్ట్ర రహదారిపై గురువారం అర్ధరాత్రి దారి దోపిడీ జరిగింది. గుర్తు తెలియని వ్యక్తులు బొలెరో వాహనాన్ని అడ్డగించి అందులోని సరుకులను మరొక వాహనంలో వేసుకొని ఉడాయించారు. పోలీసులు తెల్లవారుజాము నుంచి విచారణ చేపట్టి గుట్కా ప్యాకెట్లు అపహరించుకెళ్లినట్లు నిర్ధారించారు. ఈ సంఘటనకు సంబంధించి ఉండవెల్లి ఎస్‌ఐ బాలరాజు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి.

రూ.4.40 లక్షల గుట్కాప్యాకెట్లు
కర్నూల్ జిల్లా నందికొట్కూరుకు చెందిన కుమ్మరి శ్రీనివాసులు గుట్కాల వ్యాపారం చేస్తున్నాడు. కర్ణాటకలోని రాయిచూర్ జిల్లా నుంచి గుట్కాలను తీసుకొచ్చి వ్యాపారులకు విక్రయిస్తున్నాడు. నందికొట్కూరు నుంచి ఎప్పటిలాగే ఒక బొలెరో వాహనాన్ని అద్దెకు తీసుకొని రాయిచూర్ జిల్లా ఎరగేరిలో రూ.4.40 లక్షల గుట్కాప్యాకెట్లను కొనుగోలు చేశాడు. బొలెరో వాహన డ్రైవర్ గుట్కాప్యాకెట్లను తీసుకొని వస్తుండగా.. ఉండవెల్లి మండలం పోతులపాడు స్టేజీ వద్ద గుర్తు తెలియని వ్యక్తులు గురువారం అర్ధరాత్రి సుమారు 12.40 గంటల ప్రాంతంలో వాహనాన్ని అడ్డంగించి, వాహనాన్ని పోతులపాడు గ్రామం వైపు తీసుకెళ్లినట్లు పేర్కొన్నారు. వాహనంలోని డ్రైవర్ మౌలాన, తిప్పస్వామి(వాహన ఓనర్)ని కొట్టి గుట్కా ప్యాకెట్లను వారి వాహనంలో వేసుకున్నారు. ఈ విషయాన్ని బయటికి చెబితే చంపేస్తామని బెదిరించి అక్కడి నుంచి పరారైనట్లు తెలిపారు. జరిగిన విషయాన్ని వారు కుమ్మరి శ్రీనివాసులుకు సమాచారం ఇచ్చారు. ఆయన సంఘటన స్థలానికి వచ్చి ఉండవెల్లి పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేయడంతో, కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ వివరించారు. సంఘటన స్థలాన్ని డీఎస్పీ రంగస్వామి పరిశీలించారు.

కొనసాగిన సస్పెన్స్..
సంఘటన అర్ధరాత్రి జరగడంతో స్థానికంగా పెద్దగా ఎవరికి తెలియలేదు. సంఘటన స్థలాన్ని డీఎస్పీ రంగస్వామితో పాటు ఎస్‌ఐలు పోలీసులు సందర్శించడంతో ఏం జరిగిందో అనే అనుమానాలు నెలకొన్నాయి. పోలీసులు ఆధారాల కోసం సమీప గ్రామాల్లోని సీసీ టీవీలను పరిశీలించారు. ఎస్పీ సైతం ఈ వ్యవహారాన్ని సీరియస్‌గా తీసుకొని ఆయనే స్వయంగా పర్యవేక్షించినట్లు సమాచారం. ఈ క్రమంలో అర్ధరాత్రి పెద్ద ఎత్తున దారి దోపిడీ జరిగిందనే అనుమానాలు వ్యక్తమయ్యాయి. పోలీసులు విచారణ అనంతరం సాయంత్రం గుట్కా ప్యాకెట్ల విషయాన్ని వెల్లడించారు. దీంతో ఉదయం నుంచి కొనసాగిన సస్పెన్స్‌కు తెరపడింది. గుట్కా ప్యాకెట్లను అపహరించుకెళ్లిన వ్యక్తుల కోసం విచారణ కొనసాగుతుంది. డీఎస్పీ రంగస్వామి ఆధ్వర్యంలో నాలుగు బృందాలు దారి దోపిడీకి పాల్పడిన వ్యక్తుల కోసం గాలిస్తున్నట్లు ఎస్‌ఐ తెలిపారు.

శేషవాహనంపై నారసింహుడు

కొల్లాపూర్ రూరల్: సింగోటం లక్ష్మినరసింహస్వామి బ్రహ్మోత్సవాలలో భాగంగా శుక్రవారం స్వామివారికి వేద పండితులు శేషవాహన సేవ, డోలోత్సవం నిర్వహించారు. ఈ సందర్భంగా స్వామి ఉత్సవవిగ్రహాలను పుష్కరిణిలో స్నానాలు చేయించి శేషవాహనంపై ఊరేగించారు. అనంతరం బలిహరణం, పూర్ణాహుతి, వసంతోత్సం నిర్వహించారు. రాత్రి గర్భగుడిలో స్వామి వారికి డోలోత్సవం చేపట్టారు. ఈ కార్యక్రమంతో స్వామివారి బ్రహ్మోత్సవాలు ముగిశాయి. కాగా, నెల రోజుల పాటు జాతర జరగుతుంది. కార్యక్రమంలో ఆలయ చైర్మన్ లక్ష్మణ్‌రావు, వేద పండితులు సంపత్ కుమార్ శర్మ, తదితరులు పాల్గొన్నారు.


శేషవాహనంపై లక్ష్మినర్సింహస్వామి ఊరేగింపు

సాక్షి క్లాసిఫైడ్స్

PLOT FOR SALE
రాజాపూర్ వద్ద NH-44 దగ్గర 0% వడ్డీతో 30 నెలల EMI తో అన్ని డెవలప్‌మెంట్స్ తో 147 గజాల MUDA=(HMDA) లేఅవుట్లో ఓపెన్ Plots కలవు. ఫ్రీ సైట్ విజిట్ కు సంప్ర. ఫోన్: 9849895027 [H-792781]

SERVICES
పర్సనల్, బిజినెస్, ప్రాపర్టీ, ల్యాండ్స్ & వ్యవసాయ భూములపై మార్ట్‌గేజ్ చేసుకొని అతి తక్కువ వడ్డీకి, వారం రోజులలో ఋణం ఇప్పించబడును. ఏజెంట్స్ కావలెను. సంప్ర: 7893035286, 8901923173. [W-775802]

BUSINESS OFFER
We Super Stockist of FMCG Products of Masalas & Deserts is looking for District wise Distributors in TS & AP. www.mieps.in Cont: 70329 43367 [Y-748548]

ఆయుర్వేదాలయం
అన్ని రకముల మందులు, కీళ్ళ నొప్పులు, ఉబ్బసం, చర్మ వ్యాధులు, పైల్స్, మధుమేహం, సెక్స్ సమస్యల ప్రభావవంతమైన ఫలితం, వాజీకరణం. డా॥ అశోక్ త్రిపాఠి-సెల్. 7738897455 [K-1141937]

గమనిక
సాక్షి తెలుగు దినపత్రికలో రోజూ ప్రచురించే క్లాసిఫైడ్ ప్రకటనలు చదివి, వాటిని నిశితంగా పరిశీలించిన పిదప ప్రతిస్పందించాల్సిందిగా మా పాఠకులను కోరడమైనది. ప్రకటనదారు తెలిపే లేదా క్లెయిమ్ చేసే వాటితో ఈ వార్తా పత్రికకు ఎలాంటి సంబంధంలేదు. బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్ / డిపాజిట్ చేయవద్దు. పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరు - సాక్షి, మేనేజర్

శరత్‌చంద్రారెడ్డి బెయిలు పిటిషన్‌పై విచారణ వాయిదా

సాక్షి, న్యూఢిల్లీ: ఢిల్లీ మద్యం కుంభకోణం కేసులో శరత్‌చంద్రారెడ్డి బెయిలు పిటిషన్‌పై విచారణ రౌజ్ అవెన్యూ కోర్టు వాయిదా వేసింది. విచారణ ఈ నెల 25కు వాయిదా వేస్తున్నామని నిందితులందరి బెయిలు పిటిషన్లపై ఆ రోజు నిర్ణయిస్తామని ప్రత్యేక కోర్టు న్యాయమూర్తి జస్టిస్ ఎంకే నాగ్‌పాల్ తెలిపారు. శరత్‌చంద్రారెడ్డి బెయిలు పిటిషన్‌పై రౌజ్ అవెన్యూ కోర్టులో శుక్రవారం వాదనలు జరిగాయి. ఈడీ తరఫు న్యాయవాది వాదనలు వినిపిస్తూ సౌత్‌గ్రూప్‌పైనే ప్రధాన ఆరోపణలు చేశారు. రూ.100 కోట్లకు సంబంధించిన ఆధారాలు సేకరించామన్నారు. బెయిలు మంజూరు చేయొద్దని కోరారు. శరత్‌చంద్రారెడ్డి తరఫు సీనియర్ న్యాయవాది సిబల్ వాదనలు వినిపిస్తూ... సౌత్‌గ్రూప్ పేరుతో కొందరిని ఎంపిక చేసి అరెస్టు చేయడం తగదన్నారు. ఆధారాలు ఏమీ లేకుండా ఈడీ విచారణ సాగిస్తోందన్నారు.

తెలంగాణ ప్రభుత్వం
జిల్లా కలెక్టర్ వారి కార్యాలయము (భూసేకరణ)
నాగర్‌కర్నూల్ జిల్లా

G2/1521/2022 తేది: 20.12.2022
Gaz. No.225/22

భూసేకరణ, పునరావాస, పునఃస్థాపనలో పారదర్శకత మరియు సముచిత నష్టపరిహార హక్కు చట్టము 2013 (చట్టం 30/2013) సెక్షన్ 11(1) మరియు తెలంగాణ రాష్ట్ర భూసేకరణ, పునరావాస, పునఃస్థాపనలో పారదర్శకత మరియు సముచిత నష్టపరిహార నియమావళి 2014 రూల్ 19(1) ప్రకారము

ఫారం.6
ప్రాథమిక ప్రకటన

నాగర్‌కర్నూల్ జిల్లా తాడూర్ మండలంలోని పాపగల్ గ్రామ పరిధి నందు ఈ క్రింది షెడ్యూల్‌లో ఉదహరించిన ఎ.5.05 గుంటలు భూమి మహాత్మాగాంధీ ఎత్తిపోతల పథకం క్రింద ప్రజా ప్రయోజనార్థం అనగా డిస్ట్రిబ్యూటరి కెనాల్ -38 (MJR-1) నిమిత్తం సేకరించవలసిన అవసరం ఉన్నదని జిల్లా కలెక్టర్ నాగర్‌కర్నూల్ గారు భావిస్తున్నారు. కావున ఎ.గు. 5.05 గు. భూమి డిస్ట్రిబ్యూటరి కెనాల్ -38 (MJR-1) నిమిత్తం భూసేకరణ ద్వారా సేకరించుటకు గాను ప్రాథమిక ప్రకటన చేయడమైనది. సేకరించడానికి నిర్ధారించిన భూముల వివరాలు సంక్షిప్తంగా క్రింది ప్రకారం గలవు.

షెడ్యూల్
గ్రామము: పాపగల్ మండలం: తాడూర్ జిల్లా: నాగర్‌కర్నూల్

క్ర సం.	సర్వే నెం./ఎస్.డి నెం.	పట్టా/ఇనాం etc.	భూమి రకం పెట్ట/తరి/ఖుష్కి	భూసేకరణ చేయు ప్రతిపాదించిన విస్తీర్ణము ఎ.గుంటలు	పట్టాదారు పేరు అనుభవదారు పేరు మరియు ఏదైన హక్కులు గల ఇతర వ్యక్తులు	సరిహద్దులు ఉ	ద	తూ	ప	చెట్లు చెట్ల పేర్లు	చెట్ల సం.	నిర్మాణము వర్ణన	విస్తీర్ణం
1	2	3	4	5	6	7	8	9	10	11	12	13	14
1	342	పట్టా	మెట్ట	0.09	కృష్ణారెడ్డి తండ్రి రాంరెడ్డి (0.01 1/2) గుండాల అరుణమ్మ భర్త అశోక్ గౌడ్ (0.07 1/2) పోతుల ఇందిర భర్త క్రిష్ణా రెడ్డి పోతుల క్రిష్ణా రెడ్డి తండ్రి పాండురంగారెడ్డి పోతుల జంగుల్ రెడ్డి తండ్రి నారెడ్డి పోతుల లక్ష్మమ్మ భర్త జంగుల్ రెడ్డి తిరుమని పావని భర్త శ్రీశైలం గౌడ్	355	343	341	352	లేవు	లేవు	లేవు	లేవు
2	355	పట్టా	మెట్ట	0.36	ఎలాకం జయమ్మ భర్త నర్సింహ్మా రెడ్డి (0.11) ఎలాకం సంజీవరెడ్డి తండ్రి రాంరెడ్డి (0.25) ఎలాకం నర్సింహారెడ్డి తండ్రి రాంరెడ్డి ఎలాకం అరుణమ్మ భర్త సంజీవ రెడ్డి	357	342	356	354	మామిడి చెట్లు	0.12	లేవు	లేవు
3	356	పట్టా	మెట్ట	0.34	కృష్ణయ్య తండ్రి రాములు (0.07) రంగమ్మ తండ్రి మాసయ్య (0.04 1/2) యల్లమ్మ (0.05 1/2) బెస్త ఐస్వరి తండ్రి మాసయ్య (0.18) బొజ్జ ఎల్లమ్మ భర్త యల్లయ్య శివశంకర్ తండ్రి ఎల్లయ్య గొర్ల శిల్పకయ్య తండ్రి జంగయ్య శివరాజు తండ్రి ఎల్లయ్య శివ్వ శ్రీనివాసులు తండ్రి రాములు శివ్వ మాలి భర్త శ్రీమన్న	357	341	361	355	లేవు	లేవు	లేవు	లేవు
4	357	పట్టా	మెట్ట	0.12	ఎలాకం సంజీవరెడ్డి తండ్రి రాంరెడ్డి (0.12) పి.జానకమ్మ భర్త మన్యం రెడ్డి పి.పర్వతాలు తండ్రి మల్లయ్య పెల మల్లయ్య తండ్రి బాల మల్లయ్య పాల జంగన్న భర్త మల్లమ్మ బస్సి యల్లమ్మ భర్త బీరయ్య ఎలాకం జయమ్మ భర్త నర్సింహ్మా రెడ్డి ఎలాకం అరుణమ్మ భర్త సంజీవ రెడ్డి పేల నాగమ్మ భర్త లక్ష్మయ్య పేల లక్ష్మయ్య తండ్రి బాల మల్లయ్య ఎలాకం నర్సింహ్మా రెడ్డి తండ్రి రాంరెడ్డి కాశీకింద మల్లయ్య తండ్రి బీరయ్య	358	355	360	354	లేవు	లేవు	లేవు	లేవు
5	360	పట్టా	మెట్ట	0.32	మర్రి మైసమ్మా రెడ్డి తండ్రి హన్మయ్య రెడ్డి (0.29) మర్రి శివశంకర్‌రెడ్డి తండ్రి నర్సింహారెడ్డి (0.03) మర్రి అనంత రెడ్డి తండ్రి నర్సింహ్మా రెడ్డి మర్రి పుష్పలత భర్త గోపాల్ రెడ్డి	359	361	363	357	లేవు	లేవు	లేవు	లేవు
6	363	పట్టా	మెట్ట	0.37	బాలీరమ్మ భర్త వెంకటయ్య (0.21) మల్లయ్య తండ్రి బాలీ నాగయ్య (0.16) దికొండ కృష్ణయ్య తండ్రి ముత్యాలు దికొండ మల్లయ్య తండ్రి ముత్యాలు దికొండ సత్యనారాయణ తండ్రి ముత్యాలు దికొండ బాలమ్మ భర్త బాలీ నాగయ్య దికొండ శిల్ప మల్లయ్య తండ్రి బాలీ నాగయ్య దికొండ బొందయ్య తండ్రి బాలీ నాగయ్య దికొండ నారమ్మ భర్త నరేష్ దికొండ నారమ్మ భర్త ముత్యాలు	360	362	272	360	లేవు	లేవు	లేవు	లేవు
7	364	పట్టా	మెట్ట	0.28	బందారి సుధాకర్ రెడ్డి తండ్రి వెంకటరెడ్డి (0.28) దికొండ లక్ష్మయ్య భర్త సత్యనారాయణ కాశీకింద జంగయ్య భర్త మల్లయ్య బందారు చిందరెడ్డి తండ్రి చంద్రశేఖర్ రెడ్డి	365	363	367	363	లేవు	లేవు	లేవు	లేవు
8	367	పట్టా	మెట్ట	0.17	కృష్ణారెడ్డి తండ్రి మల్లారెడ్డి (0.03) లక్ష్మీదేవమ్మ భర్త రాంరెడ్డి (0.06) నాగేష్ తండ్రి హన్మంతు (0.08) మల్లికార్జునరెడ్డి తండ్రి రాంరెడ్డి శేరి నారాయణమ్మ భర్త కృష్ణా రెడ్డి శేరి మహేశ్వర్ రెడ్డి తండ్రి హన్మంతు రెడ్డి మర్రి సుజాత భర్త మల్లారెడ్డి సింగిరెడ్డి మధుసూదన్ రెడ్డి తండ్రి శేఖర్ రెడ్డి కొండయ్య బాలమ్మ భర్త బాలకృష్ణ బందారు మల్లమ్మ తండ్రి యల్లయ్య శేరి రాజేశ్వర్ రెడ్డి తండ్రి హన్మంతు రెడ్డి బందారు కృష్ణారెడ్డి తండ్రి వెంకట్ రెడ్డి	Neralapally	364	368	366	లేవు	లేవు	లేవు	లేవు
		మొత్తము		5.05									

భూసేకరణ, పునరావాస, పునఃస్థాపనలో పారదర్శకత మరియు సముచిత నష్టపరిహార హక్కు చట్టము 2013 (చట్టం 30/2013) సెక్షన్ 11(1) మరియు తెలంగాణ రాష్ట్ర భూసేకరణ, పునరావాస, పునఃస్థాపనలో పారదర్శకత మరియు సముచిత నష్టపరిహార నియమావళి 2014 రూల్ 19 (1)ని అనుసరించి సంబంధిత వ్యక్తులందరి దృష్టికి ఇట్టి విషయాన్ని తెస్తూ ఈ ప్రకటన జారీ చేయడమైనది.

నదరు చట్టంలోని సెక్షన్ 12 లో గల అధికారాలను అనుసరించి జిల్లా కలెక్టర్ నాగర్‌కర్నూల్ గారు, ప్రత్యేక ఉపకలెక్టరు యం.జి.ఎల్.ఐ.యస్.పి., నాగర్‌కర్నూల్ మరియు వారి సిబ్బందికి నదరు భూమిలో ప్రవేశించి సర్వే మరియు ఇతర పనులు చేపట్టుటకు అధికారమివ్వనైనది.

నదరు చట్టంలోని సెక్షన్ 11(4) ననుసరించి జిల్లా కలెక్టరు గారి అనుమతి లేకుండా షెడ్యూల్‌లో ప్రకటించిన భూములకు సంబంధించి క్రయ, విక్రయాలు లేదా ఏవిధమైన లావాదేవీలు జరుపరాదని తెలియచేయడమైనది.

నదరు చట్టంలోని సెక్షన్ 15 ననుసరించి ప్రతిపాదిత భూసేకరణ పై ఏమైన అభ్యంతరములుగాని ఆక్షేపణలు గాని ఉన్న యెడల సంబంధిత వ్యక్తులు ఈ ప్రకటన ప్రచురించబడిన తేది నుండి 60 (అరువది) దినములలోగా ప్రత్యేక ఉప కలెక్టరు యం.జి.ఎల్.ఐ.యస్.పి. నాగర్‌కర్నూల్ గారి ఎదుట అభ్యర్థనలు దాఖలు చేసుకోనవచ్చును.

భూసేకరణ తల పెట్టిన భూమిలో బొగ్గు, ఇనుము, స్టీల్ మరియు ఇతర ఖనిజములు ఇట్టి భూములలో లేదా కొంత భాగములో లభ్యమైనచో ఆ ఖనిజాలు ప్రాజెక్టు నిర్మాణమునకు ఉపయోగమున్న పక్షములో, వాటిని స్వీకరించబడును. లేనిచో స్వీకరించబడవు.

పైన చూపిన భూమిని భూసేకరణ చేయు భూముల యొక్క ప్లాన్ ఏదైనా పని దినములలో మరియు కార్యాలయ పని వేళలలో భూసేకరణ అధికారి మరియు ప్రత్యేక ఉప కలెక్టర్ కార్యాలయము, నాగర్‌కర్నూల్ నందు పరిశీలించుకొను నిమిత్తం అందుబాటులో ఉండును.

ఇట్టి ప్రతిపాదించిన భూసేకరణ తెలంగాణ ప్రభుత్వము నీటిపారుదల శాఖ G.O.Ms.No. 51, తేది 25/07/2017 ద్వారా భూసేకరణ నష్టపరిహారము, పునరావాస, పునరుపాధి కల్పన చట్టము 2013 లోని అధ్యాయము - II మరియు అధ్యాయము - III అనగా సామాజిక ప్రభావిత అధ్యాయము మరియు ఆహార భద్రత నుండి మినహాయింపును ఇవ్వడము జరిగినది.

సం/- స్పెషల్ డిప్యూటి కలెక్టర్, (భూ.సే.), (FAC), యం.జి.ఎల్.ఐ.యస్.పి., నాగర్‌కర్నూల్
సం/- అదనపు కలెక్టర్ నాగర్‌కర్నూల్
సం/- జిల్లా కలెక్టర్ నాగర్‌కర్నూల్

DIPR RO No.1132/LA-PP/Advt/Pub/2022-23

'డెక్కన్'లో టెన్షన్

శుక్రవారం సాయంత్రానికీ లభించని ఆ ముగ్గురి ఆచూకీ

- భవనం బయట ఆర్తిగా ఎదురుచూస్తున్న కుటుంబీకులు
- మంటలు, పొగ తగ్గినప్పటికీ భరించలేని స్థాయిలో వేడి
- లోపలికి ప్రవేశించ లేకపోతున్న అగ్నిమాపక బృందాలు
- డ్రోన్ల సహాయంతో కొనసాగుతున్న సెర్చ్ ఆపరేషన్
- భవనం కూల్చివేతకు సిద్ధమవుతున్న జీహెచ్ఎంసీ
- పరిశీలించి వెళ్లిన వరంగల్ నిట్‌కు చెందిన కమిటీ


భవనాన్ని పరిశీలిస్తున్న అధికారుల బృందం


వసీం


జునైద్


జహీర్

సాక్షి, సిటీబ్యూరో/రామ్‌గోపాల్‌పేట: సికింద్రాబాద్ మినిస్టర్స్ రోడ్‌లోని రాధా ఆర్కేడ్‌లో ఉన్న డెక్కన్ కార్పొరేట్ అగ్నిప్రమాదంపై ఉత్కంఠ కొనసాగుతోంది. ఈ దుర్ఘటనలో గల్లంతైన ముగ్గురి ఆచూకీ శుక్రవారం కూడా లభించలేదు. భవనంలోకి అడుగుపెట్టడానికి పరిస్థితులు అనుకూలించకపోవడంతో విక్టిమ్ లోకేషన్ కెమెరాతో (వీఎల్‌సీ) కూడిన డ్రోన్ల సాయంతో సెర్చ్ ఆపరేషన్ చేస్తున్నారు. రాధా ఆర్కేడ్‌లో గల్లంతైన డెక్కన్ కార్పొరేట్ ఉద్యోగులు జునైద్, వశీం, జహీర్ కోసం సెర్చ్ ఆపరేషన్ చేపట్టాలని పోలీసు, అగ్నిమాపక శాఖ అధికారులు శుక్రవారం ఉదయం ఉపక్రమించారు. వీరి సెల్‌ఫోన్ల లాస్ట్ లోకేషన్స్ గురువారం ఉదయం భవనం వద్దే ఉండగా...ఆ తర్వాత స్విచ్ఛాఫ్ అయ్యాయి. మరోపక్క ప్రమాదానికి కారణాలు విశ్లేషించడానికి క్లూస్‌టీమ్‌ను లోపలకు పంపాలని భావించారు. అయితే మంటలు అదుపులోకి వచ్చినప్పటికీ దట్టమైన పొగ, భరించలేని వేడి ప్రతికూలంగా మారాయి. వీటి కారణంగా నేరుగా, లేడర్ ద్వారా ప్రయత్నించినా బృందాలు భవనంలోకి అడుగుపెట్టే పరిస్థితి కనిపించలేదు.

డ్రోన్ల సాయంతో...

లోపలికి వెళ్లలేక వెనక్కు వచ్చిన టీమ్స్ డ్రోన్ కెమెరాల సాయం తీసుకోవాలని స్పష్టం చేశాయి. దీంతో అధికారులు ఓ ప్రైవేట్ సంస్థను సంప్రదించి వీఎల్‌సీతో కూడిన డ్రోన్లను రప్పించారు. వేడి కారణంగా ఈ డ్రోన్లు సైతం లోపలకు వెళ్లడం సాధ్యం కాకపోవడంతో ప్రత్యామ్నాయ మార్గాలు అన్వేషించారు. భవనం ముందు భాగంతో పాటు నాలుగు వైపుల నుంచి డ్రోన్ ఎగురవేసి అనువైన, ఖాళీగా ఉన్న భాగాల నుంచి లోపలి ప్రాంతాన్ని పరిశీలించారు.

స్పష్టత లేదు...

ఈ నేపథ్యంలోనే రెండో అంతస్తులో భవనం వెనుక వైపు రెండు చోట్ల మృతదేహాలు ఉన్నట్లు ఆనవాళ్లను శుక్రవారం సాయంత్రం గుర్తించారు. అయితే ఇవి స్పష్టంగా కనిపించకపోవడంతో ఔనా? కాదా? అనేది స్పష్టంగా చెప్పలేకపోతున్నారు. దీంతో డ్రోన్ కెమెరా చిత్రీకరించిన వీడియోను ఇంప్రొవైజేషన్ విధానంలో విశ్లేషించడానికి ల్యాబ్‌కు పంపించారు. మొదటి అంతస్తులో కొంత వరకు లోపలికి వెళ్లిన డ్రోన్ అక్కడ మెట్ల మార్గం, శ్లాబ్ కూలి ఉన్నట్లు గుర్తించింది. భవనం మొత్తం శిథిలాలు, కాలిపోయిన వస్తువులు ఉండటంతో పాటు బూడిద సుమారు రెండు అడుగుల మేర పేరుకుపోయినట్లు గుర్తించారు. పది గంటలకు పైగా మంటల్లో ఉన్న ఈ ఆరంతస్తుల భవనం స్ట్రక్చరల్ స్టెబిలిటీని నిర్ధారించాలని జీహెచ్ఎంసీ అధికారులు నిర్ణయించారు. దీంతో వరంగల్ నిట్ నిపుణుల బృందంతో కలిసి పరిశీలించారు. నిట్ డైరెక్టర్ రమణ రావు, జీహెచ్ఎంసీ అధికారులు క్రేన్ సహాయంతో భవనం పై అంతస్తుల వరకు వెళ్లి పరిశీలించి మంటల్లో కాలిపోయిన కొన్ని శిథిలాలను సేకరించారు. భవనం పూర్తిగా బలహీనంగా మారిందని దీన్ని పూర్తిగా విశ్లేషించిన తర్వాత మాత్రమే పూర్తి వివరాలు చెప్పగలుగుతామని రమణరావు అన్నారు.

బయటే బస్తీల జనం..

ఈ భవనాన్ని ఆనుకుని ఉన్న కాచిబోలిలో సుమారు 15 ఇళ్లు పాక్షికంగా దెబ్బతిన్నాయి. బస్తీలో చాలా ఇళ్లకు శుక్రవారం కూడా తాళాలు కనిపించాయి. భవనం వెనుక ఉన్న ఉత్తమ్ టవర్స్‌లో కిమ్స్ ఆస్పత్రి నర్సింగ్ హాస్టల్ ఉంది. ఇక్కడ నుంచి నర్సులను ఖాళీ చేయించారు. ఈ భవనాన్ని కూల్చిన తర్వాతే చుట్టుపక్కల వారికి అనుమతిస్తామని అధికారులు స్పష్టం చేశారు. మరోపక్క ఈ భవనం కూల్చివేత పనులు ఓ ప్రైవేట్ సంస్థకు అప్పగించారని తెలిసింది. శుక్రవారం సాయంత్రం దీన్ని పరిశీలించిన ఆ సంస్థ బృందం కూల్చివేత పూర్తి చేయడానికి మూడు–నాలుగు రోజులు పడుతుందని అభిప్రాయపడింది. గల్లంతైన వారు గుజరాత్ నుంచి వలసవచ్చిన వాళ్లు కావడంతో శుక్రవారం ఉదయానికి వారి కుటుంబీకులు నగరానికి చేరుకున్నారు. తమ వారి కోసం ఆర్తిగా ఎదురు చూస్తున్న వీరికి రెండు మృతదేహాలు కనిపించాయనే వార్త శరాఘాతమైంది. అవి ఎవరివో, కనిపించని మూడో వ్యక్తి ఎక్కడ ఉన్నాడో తెలియక ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. వసీం సోదరుడు ఇమ్రాన్, జునైద్ సోదరుడు ఆసిఫ్ రోజంతా భవనం ముందే గడిపారు. చీకటి పడటంతో శుక్రవారం రాత్రి సెర్చ్ ఆపరేషన్ ఆపేసిన అధికారులు శనివారం మళ్లీ ప్రారంభించాలని నిర్ణయించారు. అగ్నిప్రమాదం తీరు తెన్నులు, భవనం లోపలి పరిస్థితులను గమనించిన ఓ పోలీసు అధికారి 'ఆ ముగ్గురూ బతికే అవకాశాలు లేవు. ఇన్ని గంటల మంటలు, ఇంత వేడి, ఫైర్ ఇంజన్లు చల్లిన నీళ్లు..ఇవన్నీ పరిశీలిస్తుంటే వారి ఎముకలు దొరికే అవకాశమూ తక్కువే' అని వ్యాఖ్యానించారు.

పోరాటాలు లేకుండానే మా ఆశయం నెరవేర్చారు

- ఏపీ సీఎం జగన్‌కు సీపీఎం దిగ్గజ నేత, మాజీ ఎమ్మెల్యే పాటూరు రామయ్య ప్రశంసలు
- మంచి కార్యక్రమాలు చేపడుతున్నారని అభినందనలు
- మీలాంటి మనసున్న సీఎం ఆనాడు ఉంటే తన తల్లి బతికుండేదని వెల్లడి



సాక్షి, అమరావతి: ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని సీపీఎం కురువృద్ధుడు, కృష్ణా జిల్లా నిడుమోలు నియోజకవర్గం మాజీ ఎమ్మెల్యే పాటూరు రామయ్య శుక్రవారం మర్యాదపూర్వకంగా కలిశారు. తాడేపల్లిలోని సీఎం క్యాంపు కార్యాలయంలో సీఎం జగన్‌తో భేటీ అయ్యారు. పేదల శ్రేయస్సు కోసం తన జీవితాన్ని అంకితం చేసిన రామయ్య నిస్వార్థపరుడు, నిరాడంబరుడు, రైతు బాంధవుడు, భూపోరాట యోధుడుగా పేరు పొందారు. ఉద్యమాలే ఊపిరిగా బతికిన ఆయన ప్రస్తుతం వృద్ధాశ్రమంలో ఉంటున్నారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి చేపట్టిన సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలకు ఆకర్షితులైన రామయ్య సీఎంను కలిశారు. సీఎం జగన్ ఆయన ఆరోగ్య పరిస్థితిని అడిగి తెలుసుకున్నారు. ఎలాంటి ఉద్యమాలు, పోరాటాలు లేకుండా 31 లక్షల మందికి ఇళ్ల స్థలాలు ఇచ్చి, పక్కా ఇళ్లు నిర్మిస్తున్న సీఎంను రామయ్య అభినందించారు. తమ ఆశయాన్ని నెరవేర్చారని ప్రశంసించారు. 2024లో మళ్లీ అధికారంలోకి రాగానే పేదలకు వ్యవసాయ భూములు పంపిణీ చేయాలని సీఎంను కోరారు.

వైఎస్సార్‌లాగే మీరు ప్రజల గుండెల్లో ఉంటారు

పేద, మధ్య తరగతి కుటుంబాల జీవితాలను మెరుగు పరిచేందుకు విద్య, వైద్యానికి ప్రాధాన్యత ఇవ్వటం చాలా గొప్ప విషయమని రామయ్య అన్నారు. డాక్టర్ వైఎస్ రాజశేఖరరెడ్డి ఆరోగ్యశ్రీ, ఫీజు రీయింబర్స్‌మెంట్, జలయజ్ఞం లాంటి సాహసోపేతమైన కార్యక్రమాలు చేపట్టారని గుర్తు చేశారు. ఎంతో మంది పేదల జీవితాల్లో వెలుగులు నింపారన్నారు. తండ్రికి తగ్గ తనయుడిగా ప్రజల గుండెల్లో చిరస్థాయిగా నిలిచిపోయేలా వైఎస్ జగన్ నేడు మంచి కార్యక్రమాలు చేపడుతున్నారని కొనియాడారు. తాను జన్మించిన కొన్ని ఘడియలకే పోషకాహార లోపంతో తన తల్లి కన్నుమూసిందని తెలిపారు. 'మీ లాంటి మనసున్న మహారాజు ఆనాడు ముఖ్యమంత్రిగా ఉండి ఉంటే, ప్రభుత్వమే పోషకాహారం అందజేసి ఉంటే తన తల్లి బతికి ఉండేది' అంటూ రామయ్య గద్గద స్వరంతో అన్నారు. పేదల గురించి ఇంతలా ఆలోచించటం చాలా గొప్ప విషయమని, ఇదే దృక్పథం కొనసాగించాలని సీఎం జగన్‌కు సూచించారు.

సీఎంను ప్రశంసించాలనే వచ్చా

సీఎంతో భేటీ అనంతరం రామయ్య మీడియాతో మాట్లాడుతూ.. సీఎం జగన్‌ను కలవటంలో ఎలాంటి రాజకీయ ప్రాధాన్యత లేదన్నారు. ఎలాంటి కోర్కెలు, అవసరాల కోసం కలవలేదన్నారు. సీఎం వైఎస్ జగన్ చేపట్టిన కార్యక్రమాలు చాలా బాగున్నాయని ప్రశంసించడానికే వచ్చానని తెలిపారు. ఊహ తెలిసినప్పటి నుంచి సీపీఎం ఆశయాలకు కట్టుబడి పని చేశానని, తుదిశ్వాస వరకు అలాగే ఉంటానని అన్నారు. పేదల కోసం ఎన్నో పోరాటాలు చేసి లాఠీ దెబ్బలు తిన్నానని, జైలు జీవితం కూడా అనుభవించానని చెప్పారు.

టీటీడీ ధార్మిక సలహాదారుగా చాగంటి కోటేశ్వరరావు


సమావేశంలో మాట్లాడుతున్న వైవీ సుబ్బారెడ్డి

తిరుపతి అలిపిరి: టీటీడీ ధార్మిక కార్యక్రమాల సలహాదారుగా ప్రముఖ ప్రవచనకర్త, పండితుడు బ్రహ్మశ్రీ చాగంటి కోటేశ్వరరావును నియమిస్తూ హిందూ ధర్మ ప్రచార పరిషత్ కార్యనిర్వాహక కమిటీ నిర్ణయం తీసుకుందని టీటీడీ చైర్మన్ వైవీ సుబ్బారెడ్డి తెలిపారు. తిరుపతిలోని శ్రీ పద్మావతి విశ్రాంతి గృహంలో శుక్రవారం హెచ్‌డీపీపీ, ఎస్వీబీసీ కార్యనిర్వాహక కమిటీ సమావేశాలు జరిగాయి. అనంతరం టీటీడీ ఈవో ఏవీ ధర్మారెడ్డితో కలిసి ఆయా సమావేశాల్లో తీసుకున్న ముఖ్యమైన నిర్ణయాలను చైర్మన్ సుబ్బారెడ్డి మీడియాకు వెల్లడించారు.

తెలంగాణ ప్రభుత్వం
జిల్లా కలెక్టర్ వారి కార్యాలయము (భూసేకరణ)
నాగర్‌కర్నూల్ జిల్లా

G2/1533/2022 తేది : 20.12.2022
Gaz. No.245/22

భూసేకరణ, పునరావాస, పునఃస్థాపనలో పారదర్శకత మరియు సముచిత నష్టపరిహార హక్కు చట్టము 2013 (చట్టం 30/2013) సెక్షన్ 11(1) మరియుతెలంగాణ రాష్ట్ర భూసేకరణ, పునరావాస, పునఃస్థాపనలో పారదర్శకత మరియు సముచిత నష్టపరిహార నియమావళి 2014 రూల్ 19 (1) ప్రకారము

ఫారం-VI
ప్రాథమిక ప్రకటన

నాగర్‌కర్నూల్ జిల్లా తాడూరు మండలంలోని ఇంద్రకల్ గ్రామ పరిధి నందు ఈ క్రింది షెడ్యూల్‌లో ఉదహరించిన ఎ.0.12 గుంటలు భూమి మహాత్మాగాంధీ ఎత్తిపోతల పథకం క్రింద ప్రజా ప్రయోజనార్థం అనగా డిస్ట్రిబ్యూటరి కెనాల్-28 (MJR-1/MIL-2) నిమిత్తం సేకరించవలసిన అవసరం ఉన్నదని జిల్లా కలెక్టర్ నాగర్‌కర్నూల్ గారు భావిస్తున్నారు. కావున ఎ.గు. 0.12 గు. భూమి డిస్ట్రిబ్యూటరి కెనాల్ - 28 (MJR-1/MIL-2) నిమిత్తం భూసేకరణ ద్వారా సేకరించుటకు గాను ప్రాథమిక ప్రకటన చేయడమైనది. సేకరించడానికి నిర్ధారించిన భూముల వివరాలు సంక్షిప్తంగా క్రింది ప్రకారం గలవు.

షెడ్యూల్
గ్రామము: ఇంద్రకల్ మండలం: తాడూర్ జిల్లా: నాగర్‌కర్నూల్

క్ర సం.	సర్వే నెం./ఎస్.డి నెం.	పట్టా/ఇనాం etc.	భూమి రకం పెట్ట/తరి/ఖుష్కి	భూసేకరణ చేయు ప్రతిపాదించిన విస్తీర్ణము ఎ.గుంటలు	పట్టాదారు పేరు అనుభవదారు పేరు మరియు ఏదైన హక్కులు గల ఇతర వ్యక్తులు	సరిహద్దులు ఉ	ద	తూ	ప	చెట్లు చెట్ల పేర్లు	చెట్ల సం.	నిర్మాణము వర్ణన	విస్తీర్ణం
1	2	3	4	5	6	7	8	9	10	11	12	13	14
1	147	పట్టా	మెట్ట	0.12	బుర్రారం శివశంకర్ తండ్రి చంద్రయ్య (0.12) బెల్లెరి మల్లయ్య తండ్రి మల్లయ్య బెల్లెరి మాసయ్య తండ్రి మల్లయ్య బొంగ్ల చిన్న అంజనేయులు తండ్రి లక్ష్మయ్య బొంగ్ల పార్వతమ్మ భర్త అంజనేయులు బుర్రారపు పద్మ భర్త అంజనేయులు బుర్రారం అంజనేయులు తండ్రి చంద్రయ్య	144	146	145	148	లేవు	లేవు	లేవు	లేవు
		మొత్తము		0.12									

భూసేకరణ, పునరావాస, పునఃస్థాపనలో పారదర్శకత మరియు సముచిత నష్టపరిహార హక్కు చట్టము 2013 (చట్టం 30/2013) సెక్షన్ 11(1) మరియు తెలంగాణ రాష్ట్ర భూసేకరణ, పునరావాస, పునఃస్థాపనలో పారదర్శకత మరియు సముచిత నష్టపరిహార నియమావళి 2014 రూల్ 19 (1)ని అనుసరించి సంబంధింత వ్యక్తులందరి దృష్టికి ఇట్టి విషయాన్ని తెస్తూ ఈ ప్రకటన జారీ చేయడమైనది.

నదరు చట్టంలోని సెక్షన్ 12 లో గల అధికారాలను అనుసరించి జిల్లా కలెక్టర్ నాగర్‌కర్నూల్ గారు, ప్రత్యేక ఉపకలెక్టరు యం.జి.ఎల్.ఐ.యస్.పి., నాగర్‌కర్నూల్ మరియు వారి సిబ్బందికి నదరు భూమిలో ప్రవేశించి సర్వే మరియు ఇతర పనులు చేపట్టుటకు అధికారమివ్వనైనది.

నదరు చట్టంలోని సెక్షన్ 11(4) ననుసరించి జిల్లా కలెక్టరు గారి అనుమతి లేకుండా షెడ్యూల్‌లో ప్రకటించిన భూములకు సంబంధించి క్రయ, విక్రయాలు లేదా ఏవిధమైన లావాదేవీలు జరుపరాదని తెలియచేయడమైనది.

నదరు చట్టంలోని సెక్షన్ 15 ననుసరించి ప్రతిపాదిత భూసేకరణ పై ఏమైన అభ్యంతరములుగాని ఆక్షేపణలు గాని ఉన్న యెడల సంబంధిత వ్యక్తులు ఈ ప్రకటన ప్రచురించబడిన తేది నుండి 60 (అరువది దినములలోగా ప్రత్యేక ఉప కలెక్టరు యం.జి.ఎల్.ఐ.యస్.పి. నాగర్‌కర్నూల్ గారి ఎదుట అభ్యర్థనలు దాఖలు చేసుకోనవచ్చును.

భూసేకరణ తల పెట్టిన భూమిలో బొగ్గు, ఇనుము, స్టీల్ మరియు ఇతర ఖనిజములు ఇట్టి భూములలో లేదా కొంత భాగములో లభ్యమైనచో ఆ ఖనిజాలు ప్రాజెక్టు నిర్మాణమునకు ఉపయోగమున్న పక్షములో, వాటిని స్వీకరించబడును. లేనిచో స్వీకరించబడవు.

పైన చూపిన భూమిని భూసేకరణ చేయు భూముల యొక్క ప్లాన్ ఏదైనా పని దినములలో మరియు కార్యాలయ పని వేళలలో భూసేకరణ అధికారి మరియు ప్రత్యేక ఉప కలెక్టర్ కార్యాలయము, నాగర్‌కర్నూల్ నందు పరిశీలించుకొను నిమిత్తం అందుబాటులో ఉండును.

ఇట్టి ప్రతిపాదించిన భూసేకరణ తెలంగాణ ప్రభుత్వము నీటిపారుదల శాఖ G.O.Ms.No. 51, తేది 25/07/2017 ద్వారా భూసేకరణ నష్టపరిహారము, పునరావాస, పునరుపాధి కల్పన చట్టము 2013 లోని అధ్యాయము - II మరియు అధ్యాయము - III అనగా సామాజిక ప్రభావిత అధ్యాయము మరియు ఆహార భద్రత నుండి మినహాయింపును ఇవ్వడము జరిగినది.

సం/- స్పెషల్ డిప్యూటి కలెక్టర్, (భూ.సే.), (FAC), యం.జి.ఎల్.ఐ.యస్.పి., నాగర్‌కర్నూల్
సం/- అదనపు కలెక్టర్ నాగర్‌కర్నూల్
సం/- జిల్లా కలెక్టర్ నాగర్‌కర్నూల్

DIPR RO No.1139/LA-PP/Advt/Pub/2022-23

హోరాహోరీగా క్రికెట్ మ్యాచ్‌లు



తలపడుతున్న హైదరాబాద్- కశ్మీర్ జట్లు

- సత్తాచాటిన హైదరాబాద్, బెంగళూరు, ఢిల్లీ జట్లు
- సెంచరీ కొట్టిన హైదరాబాద్ క్రీడాకారుడు


సెంచరీ కొట్టిన హైదరాబాద్ క్రీడాకారుడు విక్రమ్

గద్వాల: గద్వాలలో కొనసాగుతున్న క్రికెట్ మ్యాచ్‌లు హోరాహోరీగా సాగుతున్నాయి. ఆరో రోజు హైదరాబాద్, బెంగళూరు, ఢిల్లీ జట్లు సత్తాచాటాయి. నార్త్ అమెరికా తెలుగు అసోసియేషన్(నాటా) సహకారంతో జోగుళాంబ గద్వాల జిల్లా క్రికెట్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ప్రైమ్ మినిస్టర్ కప్ టీ–20 క్రికెట్ టోర్నీ నిర్వహిస్తున్నారు. శుక్రవారం స్థానిక సోమనాద్రి స్టేడియంలో జరిగిన మ్యాచ్‌లో హైదరాబాద్ స్టార్స్- కాశ్మీర్ జట్లు తలపడ్డాయి. హైదరాబాద్ జట్టు క్రీడాకారుడు విక్రమ్ విధ్వంసకరమైన బ్యాటింగ్‌తో చెలరేగాడు. 50 బంతుల్లో 110 పరుగులు చేసి సత్తా చాటి సెంచరీ పూర్తి చేశాడు. మొదట బ్యాటింగ్ చేసిన హైదరాబాద్ జట్టు 15 ఓవర్లలో ఏడు వికెట్లను కోల్పోయి 166 పరుగులు చేసింది. అనంతరం బ్యాటింగ్‌కు దిగిన కాశ్మీర్ జట్టు 124 పరుగులకే పరిమితమైంది. సెంచరీ చేసిన విక్రమ్ మాజీ ఎమ్మెల్యే డీకే భరతసింహారెడ్డి చేతుల మీదుగా మ్యాన్ ఆఫ్ ది మ్యాచ్ అందుకున్నాడు. ఉదయం జరిగిన మొదటి మ్యాచ్‌లో ఢిల్లీ–గద్వాల జట్లు తలపడ్డాయి. మొదట బ్యాటింగ్ చేసిన ఢిల్లీ జట్టు ఎనిమిది వికెట్లను కోల్పోయి 144 పరుగులు చేసింది. అనంతరం 145 పరుగుల విజయ లక్ష్యంతో బరిలోకి దిగిన గద్వాల జట్టు 13 ఓవర్లలో కేవలం 52 పరుగులు మాత్రమే చేయగలిగింది. జట్టు విజయంలో కీలక పాత్ర పోషించిన ఢిల్లీ క్రీడాకారుడు సచిన్ గుర్జార్‌కు మ్యాన్ ఆఫ్ ది మ్యాచ్ లభించింది. తరువాత జరిగిన మ్యాచ్‌లో బెంగళూరు– జైపూర్ జట్లు తలపడ్డాయి. ఈ మ్యాచ్ రసవత్తరంగా సాగింది. టాస్ గెలిచి బ్యాటింగ్‌కు దిగిన బెంగళూరు జట్టు 15 ఓవర్లలో ఎనిమిది వికెట్ల నష్టానికి 178 పరుగులు చేసింది. అనంతరం బరిలోకి దిగిన జైపూర్ జట్టు 155 పరుగులే చేసింది. 24 పరుగుల తేడాతో బెంగళూరు జట్టు విజయం సాధించింది. నిబా మ్యాన్ ఆఫ్ ది మ్యాచ్ దక్కించుకున్నాడు. టీసీఏ జిల్లా అధ్యక్షుడు మురారి సోమశేఖర్‌రెడ్డి, బీజేపీ నాయకులు గడ్డం కృష్ణారెడ్డి, రామాంజనేయులు, కృష్ణవేణి, బండల వెంకట్రాములు, కౌన్సిలర్లు త్యాగరాజు, బండల పాండు, టీసీఏ నాయకులు కబీర్‌దాసు నర్సింహ, ప్రవీణ్, అనిల్, శ్రీధర్‌గౌడ్, వెంకు, శోభన్‌గౌడ్, కృష్ణ, జియాఉల్లా తదితరులు పాల్గొన్నారు.

రాష్ట్రస్థాయి హాకీ పోటీలకు ఉమ్మడి జిల్లా జట్టు పయనం


క్రీడాకారులతో పుర చైర్మన్ గట్టుయాదవ్, సంఘం కార్యదర్శులు తదితరులు

వనపర్తి టౌన్: రంగారెడ్డి జిల్లాలో శనివారం నుంచి 23వ తేదీ వరకు జరగనున్న రాష్ట్రస్థాయి సబ్ జూనియర్ బాలుర హాకీ పోటీల్లో పాల్గొనేందుకు శుక్రవారం ఉమ్మడి జిల్లా జట్టు బయలుదేరింది. జిల్లాకేంద్రంలోని మైదానంలో వనపర్తి జిల్లా హాకీ అసోసియేషన్ సెక్రెటరీ కుమార్ అందజేసిన క్రీడా దుస్తువులను పుర చైర్మన్ గట్టుయాదవ్ క్రీడాకారులకు పంపిణీ చేశారు. అనంతరం వారు మాట్లాడుతూ.. రాష్ట్రస్థాయిలో ఉత్తమ ప్రతిభ కనబర్చి ఉమ్మడి జిల్లాకు పేరు తీసుకురావాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో గద్వాల, మహబూబ్‌నగర్ జిల్లాల హాకీ సంఘం కార్యదర్శులు శ్రీనివాస్‌గౌడ్, ఆనంద్, వనపర్తి జిల్లా సంఘం ఉపాధ్యక్షుడు రామ్మోహన్, కార్యనిర్వాహక కార్యదర్శి నిరంజన్‌గౌడ్, అకాడమీ కోచ్ సాగర్, జావేద్, సభ్యులు రమేశ్, దయానంద్ తదితరులు పాల్గొన్నారు.


మతసామరస్యానికి ప్రతీక అబ్దుల్ ఖాదర్‌షా దర్గా


జిల్లాకేంద్రంలోని అబ్దుల్ ఖాదర్‌షా దర్గా

నేటి నుంచి 84వ ఉర్సు.. రేపు గంధోత్సవం

స్టేషన్ మహబూబ్‌నగర్: జిల్లాకేంద్రంలోని హజ్రత్ అబ్దుల్ ఖాదర్‌షా రహెమతుల్లా అలై దర్గా మతసామరస్యానికి ప్రతీకగా నిలుస్తోంది. దర్గా ఉర్సుకు ఈ ఏడాదితో 84 సంవత్సరాలు. శనివారం నుంచి ఉర్సు ప్రారంభం కానున్నాయి. ఆ రోజు సాయంత్రం 8 గంటలకు జలాభిషేకం (గుసుల్ షరీఫ్) నిర్వహించనున్నారు. 22వ తేదీన ఉర్సు వేడుకల్లో ప్రధానఘట్టమైన గంధోత్సవ వేడుకలు జరుగుతాయి. ఆ రోజు సాయంత్రం 5 గంటలకు గంధోత్సవం షేక్ బడేసాబ్ ఇంటి నుంచి బయలుదేరి అశోక్‌టాకీస్ చౌరస్తా, ఎస్‌బీహెచ్‌రోడ్డు తూర్పుకమాన్, వన్‌టౌన్ చౌరస్తా వీధుల మీదుగా దర్గా వరకు చేరుకుంటుంది. అనంతరం దర్గాలో చాదర్లు, పూలు సమర్పించి ప్రత్యేక ఫాతేహాలు అందజేస్తారు. 23వ తేదీన దీపారాధన (చిరాగా) వేడుకలు, 24న జ్యారత్ ఫాతేహాతో ఉర్సు ఉత్సవాలు ముగుస్తాయి. వేడుకల్లో భాగంగా ఖవ్వాల్ బృందాలు ఖవ్వాలీ (భక్తిగీతాలు) ఆలపిస్తాయి.

వంశపారంపర్యంగా దర్గాలో సేవలు



వంశపారంపర్యంగా దర్గాలో సేవలు అందిస్తున్నందుకు అదృష్టంగా భావిస్తున్నాం. మా తాత అబ్దుల్‌ఖాదర్ దగ్గర శిష్యుడిగా పనిచేశారు. అదే ఆనవాయితీతో మేము కూడా దర్గా సేవలో ఉన్నాం. దర్గా అభివృద్ధికి మంత్రి శ్రీనివాస్‌గౌడ్ కృషి ఎంతో ఉంది. రూ.50లక్షల నిధులతో దర్గాలో కమ్యూనిటీహాల్ గ్రానైట్ పనులతో పాటు ఇతర అభివృద్ధి పనులు చేపట్టాం. – మహ్మద్ అబ్దుల్ జమీర్‌ఖాద్రీ, దర్గా ముతవల్లీ

నిర్వాసితులకు మంచి పరిహారం


భూ నిర్వాసితులతో అభిప్రాయాలు సేకరిస్తున్న తహసీల్దార్ శ్రీనివాసులు

హన్వాడ: మహబూబ్‌నగర్ నుంచి చించోలి వెళ్లే జాతీయ రహదారి విస్తరణలో భూములు కోల్పోతున్న రైతులకు మంచి పరిహారం అందనుందని తహసీల్దార్ బక్క శ్రీనివాసులు అన్నారు. శుక్రవారం కొత్త కలెక్టరేట్‌లో త్రీజీ ఎంక్వైరీ నిమిత్తం ఆయన నేషనల్ హైవేలో భూములు కోల్పోయే భూ నిర్వాసితులతో సమావేశమయ్యారు. మండలంలోని చిన్నదర్పల్లి, పెద్దదర్పల్లి, హన్వాడ, నాయినోనిపల్లి, ఇబ్రహింబాద్ రైతులతో సమావేశమై వారి నుంచి లిఖిత పూర్వక హామీలను సేకరించారు. రైతులెవరూ అధైర్యపడొద్దని, భూములు కోల్పోయే వారికి మంచి పరిహారం అందుతుందన్నారు. నేషనల్ హైవేలో మండలంలోని ఐదు గ్రామాల నుంచి 31 మంది రైతులు సుమారు 5 ఎకరాల వరకు భూములు కోల్పోతున్నట్లు వివరించారు. వారిలో చాలా మంది 2- 10 గుంటలు మాత్రమే భూములు కోల్పోతున్నారని, వీరిలో కొందరు అసైన్డ్ పట్టాలో ఉన్నప్పటికీ వారికీ అందరిలా పరిహారం ఇస్తున్నామన్నారు.

ఆ నిర్మాణాలకు ఇవ్వం..

జాతీయ రహదారి నిర్మాణంలో భాగంగా గ్రామాల్లో 100 ఫీట్లలోపు నిర్మించుకున్న నిర్మాణాలకు ఎలాంటి పరిహారం ఇవ్వమని తహసీల్దార్ 'సాక్షి'తో అన్నారు. రోడ్డు మధ్యలో నుంచి ఇరువైపులా 50 ఫీట్ల మార్కింగ్ వరకు ఎలాంటి అనుమతులు లేకుండా తొలగిస్తామన్నారు. పంచాయతీ అనుమతులతో నిర్మించుకున్నా చెల్లవన్నారు. దీంతో చిన్నదర్పల్లి, హన్వాడ, నాయినోనిపల్లి గ్రామాల్లో రోడ్డుకు ఇరువైపులా 30– 40 ఫీట్లలోపు పంచాయతీ అనుమతులతో నిర్మించుకున్న నిర్మాణాలకు ఎలాంటి పరిహారం దక్కడం లేదు.